ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY

ఏలూరు
జిల్లా వార్తలు

3

సోమవారం 12 ఆగస్టు 2024





• గుబ్బల మంగమ్మను దర్శించుకున్న భక్తులు

పశ్చిమ ఏజెన్సీలో కొలువై ఉన్న గుబ్బల మంగమ్మ అమ్మవారిని ఆదివారం భక్తులు అధిక సంఖ్యలో దర్శించుకుని మొక్కుబడులు తీర్చుకున్నారు. రెండు వారాలుగా ఏజెన్సీలో కుండపోత వర్షా లు కురవడం, కొండవాగులు పొంగడంతో ఆలయ కమిటీ సభ్యులు అమ్మవారి దర్శనాలకు భక్తులు రాకుండా నిలుపుదల చేశారు. కామవరం వద్ద ఆలయానికి వెళ్లే దారిలో ఏర్పాటు చేసిన గేటును మూసివేశారు. ఈ క్రమంలో మూడు రోజులుగా వర్షాలు పూర్తిగా తగ్గడమే కాకుండా వేడి వాతావరణం ఉండడంతో అమ్మవారి దర్శనాలకు ఎటువంటి ఆటంకాలు లేకపోవడంతో అధిక సంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకోడానికి తరలివచ్చారు. అమ్మవారి ఆలయ ప్రాంగణం భక్తుల రాకతో కళకళ లాడింది. భక్తుల కోసం కమిటీ సభ్యులు అన్ని ఏర్పాట్లు చేశారు.

- బుట్టాయగూడెం



• నీళ్ల మధ్య శ్మశాన వాటిక

పై చిత్రం చూసి ఇదేదో చిన్నపాటి చెరువని భావిస్తే పొరబడినట్టే. ఎందుకంటే ఇది రమణక్కపేట ఎస్సీ శ్మశాన వాటిక. ఇలా వర్షాలకు నీళ్లు నిలిచి లోపలికి వెళ్లేందుకు వీలులేని పరిస్థితి నెలకొంది. ఎవరైనా చనిపోతే ఇక్కడ అంత్యక్రియలు నిర్వహించాలంటే నరకం చూడాల్సి వస్తోందని కాలనీవాసులు వాపోతున్నారు. గత వైసీపీ ప్రభుత్వం శ్మశాన వాటికల అభివృద్ధిని ఆమడ దూరంలో పెట్టడంతోనే ఈ పరిస్థితి నెలకొందని స్థానికులు ఆరోపిస్తున్నారు. గత ఐదేళ్లల్లో శ్మశాన వాటిక మెరకచేసేందుకు ఒక ట్రిప్పు మట్టి కూడా ప్రజాప్రతినిధులు, అధికారులు పోసిన దాఖలాలు లేవని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. శ్మశాన వాటికలో నీటిని తొలగించి మట్టి తోలి అభివృద్ధి చేసి మెరక చేసేలా జిల్లా ఉన్నతాధికారులు చర్యలు తీసుకోవాలని ఎస్సీ కాలనీ వాసులు కోరుతున్నారు.

- ముసునూరు

పంచాయతీలకు.. నజరానా!



గ్రామ పంచాయతీలకు అండగా కూటమి ప్రభుత్వం

గతంలో పంచాయతీల్లో స్వాతంత్ర్య వేడుకలు నిర్వహించడానికి మేజర్ పంచాయతీలకు కేవలం రూ.250, మైనర్ పంచాయతీలకు రూ.100 మాత్రమే నిధులు సమకూర్చేవారు. దీంతో వేడుకల నిర్వహణ కు ఆర్థిక ఇబ్బందులు ఆటంకంగా ఉండేవి. ఈ క్రమంలో కూటమి ప్రభుత్వం రాకతో ఆ ఇబ్బందిని తొలగిస్తూ పంచాయతీల్లో సర్పంచ్‌లు తలెత్తుకుని సగౌరవంగా జాతీయ జెండా ఎగురవేసి ఘనంగా వేడుకలు జరిపేలా ఎన్‌డీఏ ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది.

- స్వాతంత్ర్య వేడుకలు ఘనంగా నిర్వహించడానికి ఆర్థికంగా చేయూత
- మేజర్ పంచాయతీలకు రూ.25 వేలు.. మైనర్ పంచాయతీలకు రూ.10 వేలు
- జిల్లాలో మొత్తం 547 పంచాయతీలు.. ఇందులో 55 మేజర్ పంచాయతీలు
- సర్పంచ్‌ల హర్షం

ఏలూరు సిటీ, ఆగస్టు 11 : దేశానికి పట్టుకొమ్మలుగా పంచాయతీలను పేర్కొనవచ్చు. గాంధీజీ కలలుగన్న స్వరాజ్య స్థాపన జరగాలంటే పంచాయతీలు అభివృద్ధి చెందాల్సిన అవసరం ఉంది. జాతీయత చాటిచెప్పే విధంగా, స్వాతంత్ర్య సమర యోధుల సేవలను గుర్తుకు తెచ్చుకోవడానికి జాతీయ పండుగలైన స్వాతంత్ర్య దినోత్సవం, రిపబ్లిక్ డే కార్యక్రమాలను జరుపుకుంటున్నాం. అయితే ఆరోజు కార్యక్రమాలను ఘనంగా నిర్వహించేందుకు పంచాయతీలకు కొంత ఆర్థిక ఇబ్బందులు గతంలో ఉండేవి. కూటమి ప్రభుత్వం దీనిపై దృష్టి సారించింది. ఆ మేరకు వేడుకల నిర్వహణకు ప్రస్తుతం ఇస్తున్న మొత్తాలను పెంచుతూ ప్రభుత్వం నిర్ణయం తీసుకున్నట్టు ఇటీవల రాష్ట్ర పంచాయతీ రాజ్ శాఖ మంత్రి కొణిదెల పవన్ కళ్యాణ్ వెల్లడించారు. ఆగస్టు 15వ తేదీన స్వాతంత్ర్య వేడుకలను ఘనంగా నిర్వహించుకోవడానికి వీలుగా చిన్న పంచాయతీలు (మైనర్ పంచాయతీ)కు రూ.10 వేలు, మేజర్ పంచాయతీలకు రూ.25 వేలు నిధులు విడుదల చేస్తున్నట్టు ఆయన పేర్కొన్నారు. ఈక్రమంలో ఐదు వేలు జనాభా లోపు ఉన్న పంచాయతీలను మైనర్ పంచాయతీలుగా, ఐదు వేలు జనాభా దాటిన పంచాయతీలను మేజర్ పంచాయతీలుగా పేర్కొంటున్నారు.

ఈ నిధులతో స్వాతంత్ర్య దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించి పంచాయతీ సర్పంచ్‌లు సగౌరవంగా జెండా వందనం చేయాలని సూచించారు.

సుపరిపాలనకు తొలి అడుగు

పంచాయతీలను బలోపేతం చేయడానికి ఎన్‌డీఏ కూటమి ప్రభుత్వం ఇప్పటికే చర్యలు చేపట్టింది. ఇందులో తొలి అంకంగా సర్పంచ్‌లకు అత్యంత గౌర వమిస్తూ స్వాతంత్ర్య వేడుకలను ఘనంగా నిర్వహిం చడానికి నిధులను సమకూరుస్తోంది. ఈ రకంగా నగదు ప్రోత్సాహాన్ని పెంచడం హర్షనీయమని సర్పంచ్‌లు పేర్కొంటున్నారు. పార్టీల రహితంగా ఎన్నికలు నిర్వహించినా జిల్లాలో అత్యధిక శాతం పంచాయతీల్లో వైసీపీ సానుభూతి పరులే సర్పంచ్‌లుగా ఉన్నారు. గత ప్రభుత్వం హయాంలోనే పంచాయతీలకు రావాల్సిన ఆర్థిక సంఘం నిధులను ఇవ్వడం లేదంటూ, పంచాయతీల్లో అభివృద్ధి కుంటుపడు తోందని సర్పంచ్‌లు ఆందోళన కార్యక్రమాలు నిర్వహించారు. అయినా ఆర్థిక సంఘం నిధులు అంతంత మాత్రంగానే పంచాయతీలకు సమకూరాయి. అయితే కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే పంచాయతీల అభివృద్ధిపై దృష్టి సారించింది.

గతంలో ఎన్నో ఇబ్బందులు

స్వాతంత్ర్య వేడుకలు సాధారణంగా నిర్వహించినా ఒక్కొక్క పంచాయతీకి రూ.10 వేలు వరకు ఖర్చులు అయ్యేవని చెబుతున్నారు. దీనివల్ల పంచాయతీ కార్యదర్శులు చాలా ఇబ్బందులు పడాల్సిన పరిస్థితులు ఏర్పడేవి. ఒకవేళ సామాజిక స్పృహతో స్వాతంత్ర్య వేడుక లకు పంచాయతీ నిధులు ఖర్చు చేసి ఘనంగా నిర్వహించినా ఆడిట్ అభ్యం తరాలు ఉండేవి. ఈ పరిస్థితులో అప్పట్లో దాతలు , ఇతరత్రా సహకారంతో ఈ వేడుకలను పంచాయ తీల్లో నిర్వహిం చేవారు. కొన్ని పంచాయతీల్లో పంచాయతీ కార్యదర్శులే తమ సొంత సొమ్ములు ఖర్చు చేయాల్సిన పరిస్థితులు ఉండేవి. ఇప్పుడు ఆ పరిస్థితి లేకుండా ప్రభుత్వమే పంచాయతీల్లో స్వాతంత్ర్య వేడుకలు ఘనంగా నిర్వహించడానికి దాదాపు 100 రెట్లు మొత్తాన్ని పెంచి నిధులు విడు దల చేయడంతో సర్పంచ్‌ల్లో హర్షాతిరేకాలు వ్యక్తం అవుతున్నాయి. ప్రభుత్వ నిర్ణయం సుపరిపాలనకు తొలి అడుగు అని, ఆర్థిక సంఘ నిధులతో పాటు పంచాయతీల అభివృద్ధికి ప్రభుత్వం నిధులు కేటా యిస్తుందన్న నమ్మకం ఏర్పడుతోందని సర్పంచ్‌లు పేర్కొంటున్నారు.

జిల్లాలో 547 పంచాయతీలు

జిల్లాలో 547 పంచాయతీలు ఉన్నాయి. ఇందులో 55 పంచాయతీలు మేజర్ పంచాయతీలు కాగా 492 పంచాయతీలు మైనర్ పంచాయతీలుగా ఉన్నాయి. ఇప్పుడు రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన ప్రకారం స్వాతంత్ర్య వేడుకలకు సంబంధించి మేజర్ పంచాయతీలకు రూ.25 వేలు, మైనర్ పంచాయతీలకు రూ.10 వేలు నిధులు సమకూరనున్నాయి. ఈ నిధులతో గతంలో కన్నా ఎక్కువగానే స్వాతంత్ర్య వేడుకలను ఘనంగా నిర్వహించుకోవచ్చు. జాతీయతను ఉట్టి పడే విధంగా సమున్నతమైన కార్యక్రమాలను నిర్వహించడానికి అవకాశం ఏర్పడుతుంది. స్వాతంత్ర్య పోరాట స్ఫూర్తిని ఇనుమడింపజేసేలా సాంస్కృతిక కార్యక్రమాలను, స్వాతంత్ర్య సమర యోధులకు సత్కార కార్యక్రమాలను నిర్వహించవచ్చు. పెద్ద ఎత్తున ఈ కార్యక్రమాలను నిర్వహించడానికి సరిపడా నిధులను ప్రభుత్వం కేటాయించడంతో అన్ని రాజకీయ వర్గాల నుంచి హర్షం వ్యక్తమవుతోంది.



వరదొచ్చినా పులస రాలా ?

- మార్కెట్‌లో ఒడిశా పులసలు
- డిమాండ్ బట్టి రూ.వెయ్యి నుంచి రూ.2 వేలకు విక్రయం

నరసాపురం, ఆగస్టు 11: పుస్తెలు తాకట్టు పెట్టయినా పులస చేప తినాలన్నది గోదావరి జిల్లాల్లో నానుడి. కేవలం వరదల సమయంలో దొరికే ఈ అరుదైన చేప రుచి మాంసాహారుల్ని మైమరపిస్తుంది. అందుకే చేపల్లో రారాజు అంటారు. వరద వచ్చిందంటే చాలు ఈ చేప కోసం ఎగబడతారు. ఎంత దూరమైనా వెళ్లి పులస పట్టుకొస్తారు, చుట్టాలకు, బంధువులకు వండి పంపుతారు. అంతటి ప్రాధాన్యం ఉన్న ఈ చేప గత మూడేళ్ల నుంచి పెద్దగా చిక్కడం లేదు. గోదావరికి వరదొచ్చి నెల రోజులు దాటింది. అయినా చేప దొరికిన దాఖలావు లేవు. సముద్ర గర్భంలో ఉండే ఈ చేప చప్ప నీరుకు ఎదురొస్తుంది. దీంతో ఇలస.. పులసగా మారుతోంది. ఈ చప్పనీరులోకి రావడంతో దీన్ని రుచి కూడా మారిపోతుంది. అత్యధికంగా నరసాపురం, యలమంచిలి, ఆచంట, సిద్ధాంతం ప్రాంతాల్లో ఈ చేపల అమ్మకాలు జరుగుతాయి. వరదల సమయంలో మత్స్యకారులు రేయింబవళ్లు పులసల కోసం వేటాడుతుంటారు. అయితే ఈసారి పెద్దగా చిక్కలేదు. ఒకటి రెండు పడినా అవి వేలల్లో అమ్ముడైపోయాయి. కొంతకాలం నుంచి ఒడిశా పులసలు లభ్యమవుతున్నాయి. అక్కడ చౌకగా దొరికే ఈ చేపను ఐస్‌బాక్స్‌ల్లో పెట్టి ఇక్కడకు తీసుకొచ్చి రెట్టింపు ధరలకు అమ్ముతున్నారు. తెలియక కొందరు మోసపోతుంటే మరి కొందరు ఒడిశా పులస అని గుర్తించి బేరం చేసి కొంటున్నారు. సాధారణంగా పులస కేజీ దాటి ఉండదు. 700 నుంచి 900 గ్రాముల మధ్య ఉంటుంది. గోదావరి పులస అయితే ప్రస్తుతం డిమాండ్ బట్టి రూ.10 వేల నుంచి రూ.15 వేల వరకు అమ్ముతారు. అదే ఒడిశా పులస అయితే రూ. 1000 నుంచి రూ.1500 మధ్య అమ్ముతున్నారు. సరుకు ఎక్కువగా వస్తే రూ.900కు కూడా ఇచ్చేస్తున్నారు. ప్రస్తుతం ఈ తరహా పులసలు ఎక్కువగా నరసాపురం మార్కెట్‌తో పాటు చించినాడ వంతెన వద్ద అమ్ముతున్నారు.

కొత్త పింఛన్లు ఎప్పుడో..?

గత టీడీపీ ప్రభుత్వ హయాంలో పింఛన్ల కోసం లబ్ధిదారులు ఎప్పటికప్పుడు దరఖాస్తు చేసుకుని నమోదు చేయించుకునే అవకాశం ఉండేది. అయితే గత వైసీపీ ఐదేళ్ల పాలనలో ఇదో పెద్ద ప్రహసనంలా మారింది. ఆరునెలలకు ఒకసారి మాత్రమే నమోదుకు అవకాశం దక్కేది. ఈ క్రమంలో కూటమి ప్రభుత్వంలో తమకు అవకాశం ఎప్పుడు దక్కుతుందో? ఎప్పటి నుంచి పింఛన్ల లబ్ధి పొందుతామోనని వృద్ధులు, వితంతువులు, దివ్యాంగులు ఎదురు చూస్తున్నారు. కొత్తగా పింఛన్ల కోసం దరఖాస్తు చేసుకునే అవకాశంపై కొండంత ఆశతో లబ్ధిదారులు ఉన్నారు.

- గత వైసీపీ ప్రభుత్వ హయాంలో లబ్ధిదారులకు మొండిచెయ్యి
- దరఖాస్తు ప్రక్రియను కష్టతరం చేసిన జగన్ సర్కార్
- ఆరు నెలలకు ఒకసారి అవకాశం
- నిబంధనల పేరిట ఇష్టారాజ్యంగా లబ్ధిదారుల తొలగింపు
- కూటమి ప్రభుత్వం రాకతో కొత్త ఆశలు



ఏలూరు రూరల్, ఆగస్టు 11 : వైసీపీ ప్రభుత్వ హయాంలో పింఛన్లకు దరఖాస్తు చేసుకునే అవకాశం లేక పింఛన్‌కు దూరమైన అనేకమంది కూటమి ప్రభుత్వం రాకతో తమకు అవకాశం వస్తుందన్న ఆశతో రెండునెలలుగా ఎదురు చూస్తున్నారు. దానికి తోడు పింఛన్ మొత్తాన్ని కూటమి ప్రభుత్వం వచ్చి రావడంతోనే రూ.3వేల నుంచి రూ.4వేలకు పెంచింది. వైసీపీ హయాంలో నిబంధనల వడపోతతో అనర్హత బారిన పడి పింఛన్లు కోల్పోయిన వేలాది మంది అవకాశం కోసం ఎదురుచూస్తున్నారు. దాదాపు ఏలూరు జిల్లాలో కొత్తగా పింఛన్ల కోసం ఎదురుచూసే వారి సంఖ్య 25 వేల మందికి పైనే ఉన్నట్టు అధికారులు అంచనా వేస్తున్నారు. ప్రస్తుతం జిల్లాలో 2,59,063 మంది లబ్ధిదారులు వివిధ రకాల పింఛన్లు అందుకుంటున్నారు.



నాడు నిరంతర ప్రక్రియగా నమోదు

2014-19 మధ్య టీడీపీ ప్రభుత్వ హయాంలో పింఛన్ల నమోదు ప్రక్రియ నిరంతరాయంగా జరిగేది. లబ్ధిదారులు వారంలో ఏరోజైనా పింఛన్ కోసం దరఖాస్తు చేసుకునే వీలు ఉండేది. వాటిని ఏ వారానికి ఆ వారం పరిశీలించి నెలాఖరుకు జాబితాను సిద్ధం చేసేవారు. ఫలితంగా అర్హులైన లబ్ధిదారులకు ఆ మరుసటి నెల నుంచే పింఛన్ పొందే అవకాశం ఉండేది. కాని వైసీపీ ప్రభుత్వం ఈ విధానానికి స్వస్తి చెప్పింది. ఆరునెలలకు ఒకసారి మాత్రమే లబ్ధిదారుల జాబితా రూపొందించే విధానం తెచ్చింది. ఏటా జూన్, డిసెంబరు నెలల్లోనే జాబితా రూపొందిస్తామని చెప్పింది. అయితే గడిచిన ఐదేళ్లలో ఒక్కసారి కూడా ఆ ప్రకారం జాబితాలను రూపొందించినా దాఖలాలు లేవు. గతంలో టీడీపీ ప్రభుత్వం పింఛన్ల నమోదును నిరంతర ప్రక్రియగా చేస్తే వైసీపీ ప్రభుత్వం తొలగింపులను నిరంతర ప్రక్రియగా చేసుకుంది. విద్యుత్, ఇన్‌కం ట్యాక్స్, నాలుగు చక్రాల వాహనం, ఇళ్ల స్థలం, పొలం తదితరాల పేరిట వేలాదిమందిని పింఛన్ పథకానికి అనర్హులను చేసి తొలగించారు. పొరపాటున తిరస్కరణకు గురైతే మరో ఆరునెలలు ఆగాల్సి వచ్చేది. ఇలా అర్హులైన లబ్ధిదారులు వేలాదిమంది ఏళ్ల తరబడి పింఛన్ కోల్పోయిన పరిస్థితి. ఇటువంటి వారంతా కూటమి ప్రభుత్వంపై ఆశలు పెంచుకున్నారు.

నిర్ణయంపై ఎదురుచూపులు

కొత్త పింఛన్లపై కూటమి ప్రభుత్వం కొత్త నోటిఫికేషన్ కోసం పలువురు ఎదురు చూస్తున్నారు. అనేక మంది ఒకచోట నుంచి వేరే ప్రాంతానికి మారిన వారు ఉన్నారు. వారు కూడా పింఛన్‌ను తాము ప్రస్తుతం ఉండే చోటికి బదిలీ చేసుకోవాలని చూస్తున్నారు. వీటిపై ప్రభుత్వం త్వరగా నిర్ణయం తీసుకోవాలని లబ్ధిదారులు కోరుకుంటున్నారు.

రాత్రి 11 గంటలకు.. షాపులు మూయాల్సిందే

- జిల్లాలోని వ్యాపారులకు ఎస్పీ హెచ్చరిక
- అర్ధరాత్రి రోడ్లపైకి వస్తే కఠిన చర్యలు



ఏలూరు క్రైం, ఆగస్టు 11 : జిల్లాలో రాత్రి 11 గంటల కల్లా వ్యాపారాలు ముగించాల్సిందేనని జిల్లా ఎస్పీ కేపీఎస్ కిషోర్ హెచ్చరించారు. ఎటువంటి కారణాలు లేకుండా రాత్రి వేళ వీధుల్లో సంచరిస్తే అలాంటి వారిపై చట్ట ప్రకారం కఠిన చర్యలు తీసుకోవాలని ఎస్పీ ఆదేశించారు. రాత్రి 11 గంటలకు దుకాణాలన్నీ మూసివేయాలని, ఎవరైనా 11 గంటలు దాటిన తర్వాత వ్యాపారులు కొనసాగిస్తే సహించేది లేదన్నారు. వారిపై కేసులు నమోదు చేస్తామన్నారు. రాత్రివేళ జిల్లాలో గస్తీ ముమ్మరం చేస్తు న్నామని పోలీస్ పెట్రోలింగ్ మరింత కట్టుదిట్టంగా నిర్వ హించాలని సంబంధిత పోలీసులకు ఆదేశాలు జారీ చేశారు. రైల్వే స్టేషన్లు, బస్టాండ్‌లు, ముఖ్య కూడళ్లల్లో వ్యాపారాలు నిర్వహించే టిఫిన్, పాన్‌షాపులు, చిరు వ్యాపారులను కట్టడి చేయాలని పోలీసు అధికారులను ఆదేశించారు. మద్యం తాగి వాహనాలు నడిపి ప్రమాదాలకు కారణ మవుతున్న వాహనదారులపై ప్రత్యేక శ్రద్ధ పెట్టాలని అధికారులను ఆదేశించారు. ప్రతి రోజు డ్రంకెన్ డ్రైవ్ నిర్వహించి కేసులు నమోదు చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఎస్పీ ఆదేశాలతో జిల్లాలోని పోలీస్ యంత్రాంగం ఆదివారం రాత్రి 11 గంటల నుంచే రంగంలోకి దిగి చర్యలు చేపట్టారు.

జిల్లాలో వీడని వర్షాలు

ఏలూరు సిటీ, ఆగస్టు 11 : నైరుతి రుతుపవనాల విజృంభించడంతో జిల్లాలో ఇంకా వర్షాలు కురుస్తున్నాయి. ఆదివారం కూడా జిల్లాలోని పలు ప్రాంతాల్లో వర్షాలు కురిశాయి. జిల్లాలో గడచిన 24 గంటల్లో అత్యధికంగా పోలవరం మండలంలో 28.8 మిల్లీ మీటర్ల వర్షపాతం నమోదు కాగా జిల్లాలో సరాసరి వర్షపాతం 3.2 మి.మీ నమోదైంది. కొయ్యగూడెం 22.2, చింతలపూడి 14.2, ఆగిరిపల్లి 7.2 మి.మీ వర్షపాతం నమోదైంది. జిల్లాలో వర్షం కురిసిన మిగిలిన 9 మండలాల్లో 5 మి.మీ కన్నా తక్కువగా వర్షపాతం నమోదైంది.

తగ్గుతున్న గోదావరి నీటిమట్టం

పోలవరం, ఆగస్టు 11 : పోలవరంలో గోదావరి నీటిమట్టం ఆదివారం నాటికి గణనీయంగా తగ్గింది. పోలవరం ప్రాజెక్టు స్పిల్‌వే నుంచి 5,4,615 క్యూసెక్కుల జలాలను ప్రాజెక్టు అధికారులు దిగువకు విడుదల చేశారు. ప్రాజెక్టు స్పిల్‌వే ఎగువన 30.240 మీటర్లు, స్పిల్‌వే దిగువన 21.230 మీటర్లు నీటిమట్టం నమోదైనట్టు ఈఈ పి.వెంకటరమణ, మల్లికార్జునరావు తెలిపారు. తెలంగాణలోని భద్రాచలం వద్ద 31.30 అడుగుల నీటిమట్టం నమోదయ్యింది.

నేడు మంత్రి మనోహర్ ఏలూరు రాక

ఏలూరు సిటీ/ఏలూరు కార్పొరేషన్ ఆగస్టు 11 : రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ నేడు ఏలూరులో పర్యటించనున్నారు. ఈ మేరకు ఆయన ఉదయం 9గంటలకు తెనాలి నుంచి కారులో బయలుదేరి 11 గంటలకు ఏలూరు చేరుకుంటారు. సర్ సీఆర్ రెడ్డి కళాశాల ఆడిటోరియంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో పాల్గొని జిల్లాలోని రైతులకు ధాన్యం సొమ్మును సంబం ధిత రైతులకు చెక్కుల ద్వారా పంపిణీ చేస్తారు. అనం తరం మధ్యాహ్నం 2గంటలకు ఏలూరు నుంచి బయలు దేరి సాయంత్రం 4 గంటలకు అమలాపురం వెళతారు.

దిద్దుబాటుతో 'సర్దుబాటు'

నేటి నుంచి 14లోగా పూర్తి చేయండి

నేడు సర్‌ప్లస్ టీచర్లకు ఆన్‌లైన్ సర్దుబాటు కౌన్సెలింగ్

5



అలంపురం టీబీఆర్‌లో జరిగిన కార్గిల్ రజత విజయోత్సవాల్లో పాల్గొన్న హోంమంత్రి అనిత, ఎమ్మెల్యేలు బొలిశెట్టి శ్రీనివాస్, పత్సమట్ల ధర్మరాజు తదితరులు

సైనికుల సేవలు వెలకట్టలేనివి

రాష్ట్ర హోం మంత్రి అనిత, కేంద్ర మంత్రి వర్మ

భక్తులతో కళకళలాడిన శ్రీవారి క్షేత్రం



ద్వారకాతిరుమల, ఆగస్టు 11: చిన్నతిరుమలేశుని ఆలయం ఆదివారం భక్తులతో కిటకిటలాడింది. సెలవు రోజు కావడం వల్ల ఆలయానికి దాదాపు 15 వేల మంది పైబడి భక్తులు వచ్చి స్వామి, అమ్మవార్లను దర్శించినట్లు ఆలయవర్గాలు భావిస్తున్నాయి. వీరంతా ముందుగా ఆలయంలో మొక్కుబడులు తీర్చుకుని, స్వామి అమ్మవార్లను దర్శించి ప్రత్యేక పూజలు జరుపుకున్నారు. దీంతో ఆలయ పరిసరాలు ఆధ్యాత్మికతను సంతరించుకున్నాయి. దర్శనానంతరం వారంతా శ్రీవారి వకుళమాత అన్నదాన భవనంలో అన్నప్రసాదాన్ని స్వీకరించారు.

బెంగళూరు ఎక్స్‌ప్రెస్ సెప్టెంబరు వరకు పొడిగింపు

నరసాపురం, ఆగస్టు 11: నరసాపురం- బెంగళూరు మధ్య ప్రతి శుక్రవారం నడుస్తున్న 07153 ఎక్స్‌ప్రెస్ రైలును సెప్టెంబరు వరకు పొడిగిస్తూ దక్షిణ మధ్య రైల్వే ఉత్తర్వులు జారీ చేసింది. ఏడాది నుంచి ఈ రైలును పొడిగిస్తూ వస్తున్నారు. దానిలో భాగంగా ఈ నెల 16 నుంచి వచ్చే నెల 29 వరకు పొడిగించారు. ప్రతి శుక్రవారం మధ్యాహ్నం 3.50 గంటలకు నరసాపురంలో ఈ ఎక్స్‌ప్రెస్ బయలుదేరి మరుసటి రోజు ఉదయం 9.30కు బెంగుళూరు చేరుకుంటుంది. తిరిగి అక్కడ ఉదయం 10.50కి బయలుదేరి మరుసటి రోజు ఉదయం ఆరు గంటలకు నరసాపురం వస్తుంది. ఈ రైలు నెల్లూరు, రేణుగుంట, కాట్‌పాడీ మీదుగా బెంగుళూరు వెళ్తుంది.

మహనీయులను ఆదర్శంగా తీసుకోవాలి



ప్రకాశం పంతులు కుటుంబీకులను సన్మానిస్తున్న ఎమ్మెల్యే ఆరిమిల్లి రాధాకృష్ణ

తణుకు, ఆగస్టు 11 : టంగుటూరి ప్రకాశం పంతులు లాంటి మహనీయులను ప్రతి ఒక్కరు ఆదర్శంగా తీసుకోవాలని ఎమ్మెల్యే ఆరిమిల్లి రాధాకృష్ణ అన్నారు. జై ఆంధ్ర (జైభారత్) సమాచార హక్కు సంఘం ఆధ్వర్యంలో తణుకులోని టంగుటూరి ప్రకాశం పంతులు జీవిత చరిత్రపై ఆదివారం జాతీయ స్థాయి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ఆరిమిల్లి మాట్లాడుతూ నిరుపేద కుటుంబంలో పుట్టి ఉన్నత చదువుతు చదివి తొలి ఆంధ్ర రాష్ట్ర ముఖ్యమంత్రిగా సేవలందించారన్నారు. టంగుటూరి ధైర్యసాహసాలు ఆయన చూపిన మార్గం అందరికి ఆదర్శనీయమన్నారు. అనంతరం ప్రకాశం పంతులు కుటుంబీకులను సన్మానించారు. సమావేశంలో సంఘ వ్యవస్థాపక అధ్యక్షుడు బీహెచ్ సుమిత్రా నందన్, జాతీయ సలహాదారులు తమరాపు సత్యనారాయణ, కాకర్ల నాని, కడియాల సూర్యనారాయణ, వావిలాల సరళాదేవి, కూటమి నాయకులు పాల్గొన్నారు.

టీచర్ల సమస్యలపై ఎమ్మెల్సీల సమన్వయ సమావేశం

ఏలూరు అర్బన్, ఆగస్టు 11 : టీచర్ల సమస్యల పరిష్కారానికి స్పష్టమైన సమాచారం, పరిష్కార మార్గాలతో ముందుకు వస్తే విద్యా శాఖ మంత్రితో ఉపాధ్యాయ సంఘాల నాయకుల సమావేశం నిర్వహించడానికి తాము చొరవ తీసుకుంటామని ఆదివారం విజయవాడలోని ఏపీ ఎన్జీవో భవన్‌లో జరిగిన సమన్వయ సమావేశంలో ఎమ్మెల్సీలు అశోక్‌బాబు, చిరంజీవిరావు, మాజీ ఎమ్మెల్సీ రామకృష్ణ హామీ ఇచ్చారని పీఆర్టీయూ జిల్లా అధ్యక్షుడు ఆంజనేయులు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. జీవో 117 రద్దు, తెలుగు మాధ్యమం కొనసాగింపునకు ప్రభుత్వం కట్టుబడి ఉందని ఎమ్మెల్సీలు వెల్లడించారన్నారు. విద్యాసంవత్సరం ప్రారంభమై రెండు నెలలు గడుస్తున్నా టీచర్లకు బోధనేతర కార్యక్రమాల తొలగింపు, తెలుగు మాధ్యమంలో టెన్త్ పరీక్షల నిర్వహణ, ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకే తల్లికి వందనం పథకం వర్తింపు, వర్క్ అడ్జస్ట్‌మెంట్‌లో లోపాలు, జిల్లా యూనిట్‌గా కారుణ్య నియామకాలు, ఉద్యమాల సందర్భంగా టీచర్లపై బనాయించిన కేసుల ఉపసంహరణ తదితర సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం నుంచి కదలిక లేదని ఎమ్మెల్సీల దృష్టికి తీసుకెళ్ళామన్నారు. ప్రభుత్వానికి, ఉపాధ్యాయ సంఘాలకు తాము వారధిగా పనిచేసి సమస్యల పరిష్కారానికి చేయూత నిస్తామని హామీ ఇచ్చారన్నారు.

117 కేజీల రేషన్ బియ్యం స్వాధీనం

జంగారెడ్డిగూడెం, ఆగస్టు 11 : పట్టణంలోని డాంగేనగర్‌లో అక్రమంగా రేషన్ బియ్యం కలిగిఉన్న చావా రామకృష్ణపై ఆదివారం కేసు నమోదు చేసి అతని నుంచి 117 కేజీల రేషన్ బియ్యాన్ని స్వాధీనం చేసుకున్నట్లు సీఎస్ డీటీ వైవీ లక్ష్మీకుమారి తెలిపారు. కార్డుదారుల నుంచి రేషన్ బియ్యం కొని వాటిని పిండిగా మార్చి మార్కెట్‌లో అమ్ముతున్నట్లు ఆమె తెలిపారు. అతనిపై 6ఎ,7(1) కేసులు నమోదు చేశామన్నారు.

దేవదాయ, ధర్మదాయ ఉద్యోగుల కార్యవర్గం ఎంపిక



ఉమ్మడి జిల్లాల దేవదాయ, ధర్మదాయ శాఖ సిబ్బంది సంఘం నూతన కార్యవర్గం

భీమవరం టౌన్, ఆగస్టు 11 : ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా దేవదాయ, ధర్మదాయ శాఖ సిబ్బంది సంఘం నూతన కార్యవర్గం ఆదివారం తణుకులోని సీతారామంజనేయ స్వామి దేవస్థానంలో ఎన్నికైంది. జిల్లా అధ్యక్షుడిగా నల్లం రామకృష్ణ, ఉపాధ్యక్షుడిగా కె.జగదీశ్వరరావు, కార్యదర్శిగా ఇవ్వల శ్రీనివాసరావు, జాయింట్ సెక్రటరీగా పి.నాగేశ్వరరావు, కోశాధికారిగా పి.కుసుమకుమార్, కార్యవర్గ సభ్యులుగా ఎంవీవీఎస్ నందకుమార్, జీవీ రమణ, యూఎస్‌కే నబీ, ఎ.సాంబశివరావు, ఎంటీవీ రమణ ఎన్నికయ్యారు.

ఎన్నికల హామీలను అమలు చేయాలి



దొరమామిడిలో జరిగిన పీవోడబ్ల్యూ సమావేశంలో మాట్లాడుతున్న వెట్టి భారతి

బుట్టాయగూడెం, ఆగస్టు 11 : ఎన్నికల్లో కూటమి ప్రభుత్వం ప్రజలకిచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని పీవోడబ్ల్యూ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు వెట్టి భారతి, పి.లత డిమాండ్ చేశారు. ఆదివారం దొరమామిడిలో జరిగిన జిల్లా కార్యవర్గ సమావేశంలో వారు మాట్లాడారు. ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా ఓట్ల కోసం, సీట్ల కోసం ఎన్ని ఇబ్బందులు ఎదురైనా వాటిని అధిరోహించి వనరులను సృష్టించి హామీలను అమలు చేస్తామని ప్రకటించిన నేతలు ఇప్పుడు నిధుల కొరత వెంటాడుతుందని, అమలు కష్టంగా ఉందని చెప్పడాన్ని తీవ్రంగా విమర్శించారు. నిధులు కొరత ఎన్నికలకు ముందు తెలియదా? అని ప్రశ్నించారు. అధికారం కోసమే హామీలు ఇచ్చారు తప్పా మహిళలపై ప్రేమతో కాదన్నారు. మద్యం వలన మహిళలు అనేక ఇబ్బందులు పడుతున్నారని, ప్రభుత్వం మద్యాన్ని ప్రధాన వనరుగా చేసుకోవడం సిగ్గు చేటన్నారు. మద్యాన్ని నిషేదించి మహిళలకు రక్షణ కల్పించాలని డిమాండ్ చేశారు. మహిళల సమస్యల పరిష్కారానికి ఉద్యమాలను పటిష్టం చేయడం కోసం అక్టోబరులో జరిగే జిల్లా మహాసభలను జయప్రదం చేయాలన్నారు. నాయకులు ఈమని మల్లిక, కారం అరుణ, ధర్ముల లక్ష్మీ, తగరం సత్యవతి, సరియం అనిత తదితరులు పాల్గొన్నారు.

దిద్దుబాటుతో 'సర్దుబాటు'

నేటి నుంచి 14లోగా పూర్తి చేయండి

ఏలూరు అర్బన్, ఆగస్టు 11 : ప్రస్తుతానికి అమల్లోవున్న ఉపాధ్యాయ, విద్యార్థుల సంఖ్య నిష్పత్తి ప్రాతిపదికగానే గతంలో జారీ చేసిన మార్గదర్శకాల్లో కొన్ని సవరణలు చేస్తూ టీచర్ల వర్క్ అడ్జెస్ట్‌మెంట్‌ను సోమవారం నుంచి బుధవారంలోగా ముగించాలని ఆదేశిస్తూ పాఠశాల విద్య ఉన్నతాధికారులు ఆదివారం ఉత్తర్వులు జారీ చేశారు. తొలుత విడుదల చేసిన మార్గదర్శకాల్లో కొన్ని అంశాలపై అభ్యంతరాలు రావడంతో సాధ్యమైనంత మేర సవరణలు చేస్తూ, ముఖ్యంగా ఏ ఒక్క పాఠశాలలోను సబ్జెక్టు టీచరు కొరత లేకుండా చేయడమే ప్రధాన లక్ష్యంగా... హేతుబద్ధీకరణను పక్కనబెట్టి పని సర్దుబాటు మాత్రమే చేపడుతున్నట్టు వివరణ ఇచ్చారు. తాజాగా సవరించిన మార్గదర్శకాల ప్రకారం అన్ని స్కూళ్ళలోను విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా ఉపాధ్యాయులు పూర్తిస్థాయిలో ఉంటారని స్పష్టం చేశారు. కొత్తగా ఈ నెల తొమ్మిదో తేదీ నాటి యూడైస్ ఎన్ రోల్‌మెంట్ డేటాను ప్రామాణికంగా తీసుకుని వర్క్ అడ్జెస్ట్‌మెంట్‌ను చేపట్టాలని ఆదేశించారు. స్కూలులో కేడర్ జూనియర్‌నే సర్‌ప్లస్‌గా గుర్తించాలని సూచించారు.

వివరణలు/సవరణలు ఇలా...

అంతర్ జిల్లా బదిలీపై ఇక్కడకు వచ్చిన ఉపాధ్యాయుని సీనియార్టీని కొత్త జిల్లాలో విధుల్లో చేరిన తేదీనే ప్రామాణికంగా తీసుకుంటారు. ఇతర యాజమాన్యాల (ఎయిడెడ్ వగైరా) నుంచి ప్రభుత్వ పాఠశాలలో విధుల్లోకి చేరిన తేదీనే సీనియార్టీకి గుర్తించాలని సూచించారు. జీరో ఎన్‌రోల్‌మెంట్ ఉన్న పాఠశాలల్లోని టీచర్లందరూ సర్‌ప్లస్‌గానే నిర్ధారిస్తారు. హైస్కూల్ ప్లస్ ల్లోకి డిప్యూటేషన్‌పై నియమితులైన ఉపాధ్యాయులకు పని సర్దుబాటు నుంచి మినహాయింపునిచ్చారు. జీరో అడ్మిషన్లుగా ఉన్న హైస్కూల్ ప్లస్‌ల్లోని ఉపాధ్యాయులను మాత్రం ఉన్నత పాఠశాల టీచర్లుగానే పరిగణించి వర్క్ అడ్జెస్ట్‌మెంట్ చేపడతారు. స్కూలులో శాంక్షన్ పోస్టుతో నిమిత్తం లేకుండా ఎన్‌రోల్‌మెంట్ ఆధారంగా మాత్రమే ఉపాధ్యాయులను కొరత ఉన్న పాఠశా లలకు సర్దుబాటు చేస్తారు. కనీస వేతన స్కేలు(ఎం టీఎస్)పై నియమితు లైన ఎస్జీటీలుకూడా సర్‌ప్లస్‌గాఉంటే పని సర్దుబాటును వర్తింపజేస్తారు.

నేడు సర్‌ప్లస్ టీచర్లకు ఆన్‌లైన్ సర్దుబాటు కౌన్సెలింగ్

ఏలూరు అర్బన్, ఆగస్టు 11 : ఉపాధ్యాయుల పని సర్దుబాటుకు ఆన్‌లైన్ కౌన్సెలింగ్ సోమవారం మధ్యాహ్నం మూడు నుంచి సాయంత్రం ఐదు గంటల వరకు జరుగుతుందని డీఈవో అబ్రహం ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఏలూరు జిల్లాలోని 28 మండలాల్లో మిగులు (సర్‌ప్లస్) ఉపాధ్యాయుల జాబితాను ఆదివారం రాత్రి జిల్లా వెబ్‌సైట్‌లో పొందుపర్చడం తోపాటు, సంబంధిత టీచర్ల ఫోన్లకు వ్యక్తిగతంగా పాఠశాల విద్య కమిషనరేట్ నుంచి మెసేజ్ పంపించడం, ఎంఈవోల లాగిన్‌కు అప్‌లోడ్ చేయడం జరుగుతాయన్నారు. సదరు జాబితాలో ఉన్న సర్‌ప్లస్ టీచర్లు వారి వివరాలు సరిచూసుకుని, ఏవైనా తేడాలుంటే లిఖితపూర్వకంగా సంబంధిత ఎంఈవో కార్యాలయంలో సోమవారం ఉదయం 11 గంటల్లోగా అర్జీల రూపంలో అందజేయాలని ఆదేశించారు. ఆన్‌లైన్ విధానంలో వర్క్ అడ్జస్ట్‌మెంట్ జరుగుతున్నందున అర్జీలను ఉదయం 11 గంటల తర్వాత స్వీకరించబోమని స్పష్టం చేశారు. జాబితాలోఉన్న సర్‌ప్లస్ ఉపాధ్యాయులందరూ సంబంధిత ఎంఈవో కార్యాలయాల్లో జరిగే పని సర్దుబాటు కౌన్సెలింగ్‌కు తప్పనిసరిగా హాజరుకావాలని ఆదేశించారు. కాగా జిల్లాలో మున్సిపల్ యాజమాన్య పాఠశాలల్లోని సర్‌ప్లస్ టీచర్లను మినహాయించి, మిగతా పాఠశాలల్లో 370 మందికిపైగా ఎస్జీటీలు, స్కూల్ అసిస్టెంట్లు 'మిగులు' జాబితాలో ఉన్నారు. వీరిలో పది శాతం మందిలోపే స్కూల్ అసిస్టెంట్లు ఉన్నారు. టీచర్ల కొరత ఉన్న పాఠశాలలు మాత్రం 220 వరకు ఉన్నాయి.

సైనికుల సేవలు వెలకట్టలేనివి

రాష్ట్ర హోం మంత్రి అనిత, కేంద్ర మంత్రి వర్మ



పరమవీరచక్ర అవార్డు గ్రహీత సంజయ్‌కుమార్‌ను సత్కరిస్తున్న హోంమంత్రి అనిత , ఎమ్మెల్యేలు బొలిశెట్టి , పత్సమట్ల తదితరులు

పెంటపాడు, ఆగస్టు 11 : సైనికుల సేవలు వెలకట్టలేనివని రాష్ట్ర హోం శాఖ మంత్రి వంగలపూడి అనిత అన్నారు. మాజీ సైనిక ఉద్యోగుల సంక్షేమానికి తన వంతు కృషి చేస్తానన్నారు. టీబీఆర్ సంస్థ అధినేత తనుబుద్ది భోగేశ్వరరావు ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన కార్గిల్ దివాస్ రజిత విజయోత్సవ వేడుకలలో హోంమంత్రి అనిత ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. అలంపురం టీబీఆర్ సైనిక్ స్కూల్ వద్ద జాతీయ జెండాను ఆవిష్కరించి, అమరవీరుల విగ్రహానికి నివాళులర్పించారు. టీబీఆర్ సంస్థ నూతనంగా ప్రారంభించిన సైనిక్ అకాడమి శిక్షణ కేంద్రాన్ని పరిశీలించారు. అనంతరం ఏపీ నిట్ ప్రాంగణంలో జరిగిన కార్యక్రమంలో మంత్రి అనిత మాట్లాడుతూ తన దృష్టికి వచ్చిన మాజీ సైనికుల సమస్యలను సీఎం చంద్రబాబుతో మాట్లాడి పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. మాజీ సైనిక ఉద్యోగుల రిజర్వేషన్ పెంచేందుకు ఈ అంశాన్ని క్యాబినెట్ దృష్టికి తీసుకువెళ్తానన్నారు. మరో ముఖ్య అతిథి కేంద్రమంత్రి భూపతిరాజు శ్రీనివాస వర్మ మాట్లాడుతూ సైనికుల సేవల వల్లే దేశ ప్రజలందరూ సుఖ శాంతులతో జీవిస్తున్నారన్నా రు. ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్ మాట్లాడుతూ మిలటరీ మాధవరంలో సైని క క్యాంటిన్ ఏర్పాటు చేయాలని హోం మంత్రిని కోరారు. ఉంగుటూరు ఎమ్మెల్యే పత్సమట్ల ధర్మరాజు మాట్లాడుతూ సరిహద్దులో సైనికులు చేసే పోరాట ఫలితమే దేశం ప్రశాంతంగా ఉండటానికి కారణమన్నారు. అనం తరం పరమవీరచక్ర అవార్డు గ్రహీత సంజయ్‌కుమార్‌తో పాటు పలువురు మాజీ సైనిక ఉద్యోగులను శాలువా, మెమెంటోలతో సత్కరించారు. ఈ సందర్భంగా నిర్వహించిన విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. మాజీ ఎమ్మెల్సీ సోము వీర్రాజు, టీడీపీ నియోజకజవర్గ ఇన్‌చార్జి వలవల బాబ్జి , బీజేపీ నియోజకవర్గ కన్వీనర్ ఈతకోట తాతాజీ, రాష్ట్ర సైనిక్ వెల్ఫేర్ డైరెక్టర్ వి.వెంకరెడ్డి, అగర్వాల్ పాకర్స్ ఫౌండర్ రమేష్ అగర్వాల్, విశ్రాంత మేజర్ జనరల్ బీవీ రావు, విశ్రాంత లెఫ్టినెంట్ జనరల్ కేజీ కృష్ణ, కరస్పాండెంట్ పద్మావతి, డైరెక్టర్ రవికిరణ్ పాల్గొన్నారు.

నీట్-పీజీ పరీక్ష ప్రశాంతం



పరీక్షకు హాజరవుతున్న విద్యార్థులు

ఏలూరు అర్బన్, ఆగస్టు 11 : పీజీ వైద్య విద్య కోర్సుల్లో ప్రవేశాలకు ఆదివారం దేశ వ్యాప్తంగా నిర్వహించిన నీట్-పీజీ ఆన్‌లైన్ పరీక్ష ఏలూరులోని రెండు కేంద్రాల్లో ప్రశాంతంగా ముగిసింది. సీఆర్ఆర్ ఇంజనీరింగ్ కళాశాల పరీక్షా కేంద్రంలో ఉదయం, మధ్యాహ్నం సెషన్లలో వంద మంది అభ్యర్థుల చొప్పున హాజరుకావాల్సి ఉండగా 99 మంది వంతున హాజరయ్యారు. సత్రంపాడు సిద్ధార్థ క్వెస్ట్ పరీక్ష కేంద్రంలో ఉదయం సెషన్‌లో జరిగిన పరీక్షలకు 149 మందికి 145 మంది, మధ్యాహ్నం సెషన్‌లో 149 మందికి 147 మంది హాజరయ్యారు. నీట్-యూజీ పరీక్ష ప్రశ్నపత్రం లీక్ ఉదంతం దేశవ్యాప్తంగా వివాదాస్పదం కావడంతో జూన్ 23న జరగాల్సిన నీట్-పీజీ పరీక్ష వాయిదావేసి పలు ముందస్తు జాగ్రత్తలు తీసుకుని ఆదివారం నిర్వహించారు.

● తాడేపల్లిగూడెం రూరల్ : మెడికల్ కళాశాలల్లో పోస్టు గ్రాడ్యుయేషన్ కోర్సుల్లో ప్రవేశానికి నిర్వహించే నీట్ పరీక్షలు ఆదివారం ప్రశాంతంగా ముగిశాయి. తాడేపల్లిగూడెం మండలం పెదతాడేపల్లి వాసవి ఇంజనీరింగ్ కళాశాలలో రెండు షిఫ్టుల్లో జరిగిన పరీక్షలకు 222 మందికి గాను 216 మంది అభ్యర్థులు పరీక్షలు రాసినట్టు ప్రిన్సిపాల్ రత్నాకరరావు తెలిపారు.

నిత్యాన్నదానానికి రూ.49 లక్షల చెక్కు అందజేత



అన్నదానం నిధుల చెక్కును అందజేస్తున్న ఎమ్మెల్యే అంజిబాబు

భీమవరం టౌన్, ఆగస్టు 11 శ్రీసోమేశ్వర జనార్దన స్వామివార్ల నిత్యాన్నదాన ట్రస్టుకు అన్నపూర్ణ పార్వతి సమేత శ్రీసోమేశ్వర లక్ష్మీ, జనార్దన స్వామి వార్ల నిత్యాన్నదాన కమిటీ నుంచి ఆదివారం రూ.49,82,825.53ల చెక్కును ఎమ్మెల్యే పులపర్తి రామాంజనేయులు (అంజిబాబు) చేతుల మీదుగా దేవస్థానంకు అందజేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ గతంలో ఆలయానికి వచ్చిన భక్తులకు స్వామి వారి ప్రసాదాన్ని అందించాలనే సంకల్పంతో అప్పటి ఆలయ ఛైర్మన్ వేగేశ్న రంగరాజు దాతల నుంచి సేకరించి నిత్యాన్నదనాన్ని ప్రారంభించారని, ట్రస్టు బోర్డు ముగియడంతో అప్పటి నుంచి సేకరించిన నిధులను ఇప్పుడు నిత్యాన్నదానానికి అందజేశారని తెలిపారు. నిత్యాన్నదానానికి దాతల సహకారంతో షెడ్‌ను ఏర్పాటు చేస్తామన్నారు. అన్నదానానికి నిధులు సేకరించిన రంగరాజును సత్కరించారు. ఆలయ ఈవో డి.రామకృష్ణంరాజు, ఆలయ ప్రధానార్చకులు కందుకూరి సోంబాబు, చెరుకూరి రామకృష్ణ, జనసేన పట్టణ అధ్యక్షుడు చెనమల్ల చంద్రశేఖర్, వబిలిశెట్టి రామకృష్ణ, ఏఎంసీ మాజీ చైర్మన్ కోళ్ల నాగేశ్వరరావు, బండి రమేష్ కుమార్, రాట్నల శ్రీనివాసరావు, గంటా త్రిమూర్తులు, నల్లం చిట్టిబాబునల్లం వెంకటకృష్ణనాగేశ్వరరావు, వేలూరి శ్రీదర్, చెరకుపల్లి సంతోష్, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు. ముందుగా ఎమ్మెల్యే అంజిబాబుకి అర్చకులు పూర్ణ కుంభస్వాగతం పలికారు.

పోలవరం నిర్వాసితులకు పరిహారం ఇవ్వండి

మంత్రికి సీపీఎం నాయకుల వినతి



మంత్రి రామానాయుడుకు వినతిపత్రం అందజేస్తున్న సీపీఎం నాయకులు

కుక్కునూరు, ఆగస్టు 11: పోలవరం నిర్వాసితులకు కాంటూరుతో సంబంధం లేకుండా ఆర్‌అండ్‌ఆర్ పరిహారం ఇవ్వాలని సీపీఎం ఏలూరు జిల్లా కార్యదర్శి ఎ.రవి, సీపీఎం బృందం నాయకులు కోరారు. పాలకొల్లులో జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడ్ని ఆదివారం వారు కలిసి వినతిపత్రం అందజేశారు. నిర్వాసితులు పోలవరం ప్రాజెక్టు కోసం త్యాగాలు చేస్తున్నారని కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ప్రకటిస్తున్నాయి కానీ క్షేత్రస్థాయిలో పరిశీలిస్తే నిర్వాసితులపై ప్రభుత్వాలకు ఏమాత్రం శ్రద్ధ లేకుండా పోయిందని మంత్రి దృష్టికి తీసుకొచ్చారు. 2022 జూలైలో భారీ వరదలు వచ్చిన క్రమంలో ఏజెన్సీలోని కుక్కునూరు, వేలేరుపాడు మండలాలు మొత్తం వరదకు గురయ్యాయన్నారు. 41.15 కాంటూరు లేవిల్‌తో సంబంధం లేకుండా అన్ని గ్రామాలకు పరిహారం అందించాలని అన్నారు. అలాగే నిర్వాసితులకు వ్యక్తిగత పునరావాస పరిహారం, ఇళ్ల పరిహారం చెల్లించి పునరావాస కాలనీలకు తరలించాలని మంత్రిని కోరారు. అందుకు మంత్రి రామానాయుడు సానుకూలంగా స్పందించి నిర్వాసితులు ఎదుర్కొంటున్న సమస్యలను ఇటీవల వరదల సమయంలో ప్రత్యక్షంగా చూశామని త్వరలో వారందరికి న్యాయం చేస్తామని హామీ ఇచ్చారు. సీపీఎం రాష్ట్ర నాయకులు మంతెన సీతారామ్, వై.నాగేంద్రరావు, ఎం.జీవరత్నం, వై.సాయికిరణ్ తదితరులు పాల్గొన్నారు.

నేడు హిందువులపై దాడులకు నిరసనగా ర్యాలీ

కైకలూరు, ఆగస్టు 11: బంగ్లాదేశ్‌లో హిందువులపై దాడులకు నిరసనగా హిందూ సంఘాల ఆధ్వర్యంలో కైకలూరులో శాంతియుతంగా నిరసన ర్యాలీ నిర్వహించనున్నట్లు ఆర్‌ఎస్‌ఎస్, హిందూ సంఘ సభ్యులు తెలిపారు. సోమవారం సాయంత్రం 5 గంటలకు కైకలూరు గాంధీబొమ్మ సెంటర్ నుంచి మాగంటి థియేటర్ వరకు జాతీయ రహదారి వెంబడి శాంతియుత నిరసన తెలియజేస్తామని ఈ దాడులను ఖండిస్తూ హిందువులు పెద్దఎత్తున పాల్గొనాలని పిలుపునిచ్చారు.

క్రైం కార్నర్

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

కుక్కునూరు, ఆగసు 11: మండలంలోని మారేడుబాక గ్రామానికి చెందిన గంటసాల శ్రీను (40) అనే వ్యక్తి ఆదివారం తెలంగాణలోని అశ్వారావుపేట మండలం వినాయకపురం గ్రామంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో దుర్మరణం పాలయ్యాడు. వివరాలు ఇలా ఉన్నాయి. అమ్మవారి ఆలయం వద్ద జరిగిన ఫంక్షన్‌కి వంట చేసేందుకు మరో వ్యక్తితో కలిసి శ్రీను వెళ్ళాడు. ఆ కార్యక్రమం పూర్తయిన తరువాత ద్విచక్రవాహనంపై తిరిగి వస్తుండగా వినాయకపురంలోని పెట్రోల్ బంకు వద్ద వెనుక నుంచి వచ్చిన ట్రాక్టర్ బలంగా ఢీకొట్టింది. దీంతో దిచక్ర వాహనంపై వెనుక వైపు కూర్చున్న శ్రీను కిందపడి పోయాడు. ట్రాక్టర్ అతనిపై నుంచి వెళ్ళడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. అస్వారావుపేట పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

చికిత్స పొందుతూ వృద్ధుడి మృతి

ఏలూరు క్రైం, ఆగస్టు 11 : రోడ్డు ప్రమాదంలో తీవ్ర గాయాల పాలై ఏలూరు ప్రభుత్వాస్పత్రిలో చికిత్స పొందుతున్న గుర్తు తెలియని వృద్ధుడు ఆదివారం మృతి చెందాడు. తాడేపల్లిగూడెంలోని ఎన్టీఆర్ బొమ్మ వద్ద రోడ్డు పై నడిచి వెళ్తున్న ఒక వృద్ధుడిని (60) గుర్తుతెలియని వాహనం ఢీకొని వెళ్ళిపోయింది. ఈ నెల 10వ తేదీ మధ్యాహ్నం మూడు గంటలకు 108 అంబులెన్సులో తాడేపల్లిగూడెం ప్రభుత్వాస్పత్రికి తీసుకువెళ్ళారు. మెరుగైన చికిత్స నిమిత్తం ఏలూరు ప్రభుత్వాస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ ఆదివారం ఉదయం మృతి చెందాడు. ఈ సంఘటనపై ఆస్పత్రి వైద్యులు ఎమ్మెల్సీగా నమోదు చేసి ఔట్‌పోస్టు పోలీసులకు సమాచారం ఇచ్చారు.

స్కూటర్ ఢీకొని వృద్ధురాలికి తీవ్ర గాయాలు

ఏలూరు క్రైం, ఆగస్టు 11 : రోడ్డుపై నడిచివెళ్తున్న ఒక వృద్ధురాలిని బాలుడు స్కూటర్‌తో ఢీ కొన్నాడు. ఈ ప్రమాదంలో ఆ వృద్ధురాలితో పాటు ఆ యువకుడికి కూడా తీవ్ర గాయాలయ్యాయి. ఏలూరు అమీనాపేట పోలీస్ క్వార్టర్స్ ప్రాంతానికి చెందిన గుడివాడ వెంకట రమణ (70) ఆదివారం రాత్రి ఎనిమిది గంటల ప్రాంతంలో ఏలూరు ఫైర్‌స్టేషన్ వద్ద నవయుగ హోటల్ ముందు రోడ్డుపై నడిచి వెళ్తుంది. ఏలూరు ఎమ్మార్సీ కాలనీకి చెందిన 17 ఏళ్ళ బాలుడు స్కూటర్‌తో ఆమెను ఢీ కొన్నాడు. ఈ ప్రమాదంలో వృద్ధురాలికి తీవ్ర గాయాలు కాగా ఆ యువకుడికి గాయాలు అయ్యాయి. వీరిద్దరిని ఏలూరు ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ఈ సంఘట నపై వైద్యులు ఎమ్మెల్సీగా నమోదు చేసి ఆస్పత్రి ఔట్‌పోస్టు పోలీసులకు సమాచారం ఇచ్చారు.

వృద్ధురాలి ఆత్మహత్యాయత్నం

ఏలూరు క్రైం, ఆగస్టు 11 : దీర్ఘకాలిక వ్యాధితో బాధపడుతున్న ఒక వృద్ధురాలు ఆదివారం మధ్యాహ్నం తన ఇంట్లో ఉరి వేసుకుని ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. ముసునూరు మండలం గుడిపాడుకు చెందిన జె షైమావతి (60) కొంత కాలం నుంచి దీర్ఘకాలిక వ్యాధితో బాధపడుతోంది. జీవితంపై విరక్తి చెందిన ఆ వృద్ధురాలు ఆదివారం మధ్యాహ్నం ఉరి వేసుకుని ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. ఇది గమనించిన కుటుంబ సభ్యులు వెంటనే ఏలూరు ప్రభుత్వాస్పత్రికి తీసుకువచ్చారు. ప్రస్తుతం చికిత్స పొందుతుంది.

తాళం వేసి ఉన్న ఇంట్లో చోరీ



బీరువాను పరిశీలిస్తున్న ఎస్‌ఐ నాగబాబు

ఆకివీడు, ఆగస్టు 11 : తాళం వేసి హైదరాబాద్ వెళ్ళిన ఇంట్లో దొంగలు పడ్డారు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు స్థానిక శ్రీరామపురానికి చెందిన గుగ్గిళ్ళ రవితేజ ఇంటి తాళాలు పగలగొట్టి బంగారం దొంగిలించినట్లు బంధువులు తెలిపారన్నారు. గత నెలలో (సుమారు 15 రోజులు) రవితేజ ఇంటికి తాళం వేసి హైదరాబాబాద్ వెళ్ళారు. ఆదివారం రవితేజ బంధువులు ఆకివీడు పెళ్ళికి వచ్చి శ్రీరామపురంలోని ఇంటికి వెళ్ళగా మెయిన్ ద్వారం తలుపులు తెరచి ఉండడంతో పాటు బీరువాలో బట్టలు చిందర వందరంగా ఉన్నాయి. బంధువులు రవితేజకు ఫోన్ చేసి విషయం తెలిపి, పోలీసులకు సమాచారం ఇచ్చారు. బీరువాలో ఉండాల్సిన నగదు, బంగారం చోరీకి గురైనట్లు రవితేజ ఫోన్‌లో తెలిపారు. రవితేజ సోమవారం ఆకివీడు వచ్చిన తరువాత పూర్తి వివరాలు తెలుస్తాయని పోలీసులు తెలిపారు. అనంతరం ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేస్తామని ఎస్‌ఐ తెలిపారు.

బాలిక మిస్సింగ్.. కేసు నమోదు

యలమంచిలి, ఆగస్టు 11: మండలంలోని ఒక గ్రామానికి చెందిన ఒక బాలిక శనివారం పాలకొల్లులోని జూనియర్ కళాశాలకు వెళ్లి తిరిగి రాక పోవడంతో మిస్సింగ్ కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ కె.గుర్రయ్య తెలిపారు. బాలిక పాలకొల్లు పట్టణంలోని ఒక జూనియర్ కళాశాలలో ఇంటర్ సెకండ్ ఇయర్ చదువుతుంది. యధావిధిగా శనివారం ఉదయం ఇంటి నుంచి కళాశాలకు వెళ్లింది. బాలిక సాయంత్రం ఎంతసేపటికీ తిరిగి రాక పోవడంతో కుటుంబ సభ్యులు ఆమె ఆచూకీ కోసం గాలించారు. కుమార్తె ఆచూకీ లభించకపోవడంతో తండ్రి పోలీసులను ఆశ్రయించారు. తండ్రి ఫిర్యాదు మేరకు మిస్సింగ్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

కేసుల నమోదు

ఉండి ఆగస్టు 11: 'ఎందుకు అంత ర్యాష్‌గా డ్రైవ్ చేసుకుంటూ వెళ్తున్నావ్' అని అడిగినందుకు మోటర్ సైక్లిస్టును వ్యాన్ డ్రైవర్ గాయపరిచిన విషయంపై కేసు నమోదు చేసినట్లు ఉండి హెడ్ కానిస్టేబుల్ యెషయా తెలిపారు. ఈ ఘటన ఈ నెల ఎనిమిదో తేదీన ఉండి మండలం చెరుకువాడ శివారు ఆంజనేయ స్వామి ఆలయం వద్ద చోటు చేసుకుంది. ఇదే కేసుకు సంబంధించి ఆకివీడుకు చెందిన మోటర్‌సైకిలిస్టు మీరా మొహిద్దీన్ చెరుకువాడ వద్ద తన వ్యాన్‌ని నిలిపి తనను కొట్టి, వ్యాన్‌లో ఉన్న రూ.30 వేల నగదు తీసుకుని వెళ్లిపోయాడని భీమవరంనకు చెందిన వ్యాన్ డ్రైవర్ ఎలీషా పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు హెడ్ కానిస్టేబుల్ యెషయా తెలిపారు. ఇరువురి కేసులు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు హెడ్ కానిస్టేబుల్ తెలిపారు.

చాకుతో దాడి చేసి హత్యాయత్నం

భీమవరం క్రైం, ఆగస్టు 11 : భీమవరం రెండో పట్టణంలో ఇటీవల జరిగిన ఓ సినిమా పునఃప్రదర్శన సందర్భంగా ఓ యువకుడిపై హత్యాయత్నం జరిగింది. పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. సినిమా ప్రదర్శన సమయంలో చిన్నపాటి ఘర్షణ శుక్రవారం జరిగింది. ఆ రోజు సాయంత్రం హర్షప్రవీణ్‌ను సీహెచ్ రాహుల్ చాకుతో పొట్టలో పొడిచి పారిపోయాడు. గాయపడిన బాధితుడ్ని చికిత్స కోసం ఆసుపత్రిలో చేర్చారు. అక్కడ్నుంచి వచ్చిన సమాచారంతో విచారణ చేశారు. నిందితుడ్ని అరెస్టు చేశారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ జి.వీర్రాజు తెలిపారు.

సబ్ సెంటర్‌లో ఫ్రిజ్ చోరీ



సిబ్బంది వద్ద వివరాలను సేకరిస్తున్న పోలీసులు

పెంటపాడు, ఆగస్టు 11 : స్థానిక పీహెచ్‌సీ సబ్ సెంటర్‌లో శనివారం అర్ధరాత్రి గుర్తు తెలియని వ్యక్తులు చోరీకి పాల్పడ్డారు. సబ్ సెంటర్ తలుపు గొళ్ళాన్ని రాడ్‌తో పెకిలించి లోపల ఉన్న ఫ్రిజ్‌ను ఎత్తుకెళ్ళారు. సబ్ సెంటర్ బయట ఉన్న గుర్తులు బట్టి ఆటోలో ఫ్రిజ్‌ను తరలించి ఉంటారని స్థానికులు భావిస్తున్నారు. దీనిపై సబ్‌సెంటర్ అధికారులు ఫిర్యాదు మేరకు పోలీసులు వచ్చి వివరాలు నమోదు చేసుకున్నారు.

కోడి వ్యర్థాల రవాణా వాహనం సీజ్

భీమడోలు, ఆగస్టు 11 : నిబంధనలకు విరుద్ధంగా చేపలకు మేత వేసేందుకు తరలిస్తున్న కోడి వ్యర్థాల వాహనాన్ని సీజ్ చేసి కేసు నమోదు చేసినట్లు భీమడోలు ఎస్‌ఐ సుధాకర్ తెలిపారు. ఏలూరు మండలం కొక్కిరాయిలంక గ్రామానికి చెందిన ఘంటసాల శేషుబాబు అతని సొంత వాహనం టాటా యోధపై డ్రైవర్ అన్న, దొంగల రాజేష్‌తో కలిసి పోతవరం వెంకటేశ్వర హేచరీస్ నుంచి వ్యర్థాలతో తరలిస్తున్నారు. సమాచారం అందుకున్న పోలీసులు సూరప్పగూడెం రహదారిపై వాహనాన్ని పట్టుకుని కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

లింగంపల్లి ఎక్స్‌ప్రెస్‌లో దోపిడీకి యత్నం

» పల్నాడు జిల్లా నడికూడి వద్ద ఘటన » పశ్చిమలో ఉలికిపాటు



నరసాపురం, ఆగస్టు 11 లింగంపల్లి ఎక్స్‌ప్రెస్‌లో ఆదివారం తెల్లవారు జామున పల్నాడు జిల్లా నడికూడి సమీపంలోని దాచేపల్లి మాచర్ల రోడ్ ఓవర్ బ్రిడ్జి వద్ద ప్రయాణికులను దోచుకునేందుకు దోపిడీ దొంగలు విశ్వప్రయత్నం చేశారు. అయితే ప్రయాణికులు, రైల్వే పోలీసుల అప్రమత్తంతో దోపిడీ దొంగల ప్రయత్నం ఫలించలేదు. దీనికి సంబంధించి రైల్వే పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నారు. నరసాపురం నుంచి లింగంపల్లి ఎక్స్‌ప్రెస్ (17255) శనివారం సాయంత్రం 6.50 గంటలకు బయలుదేరింది. పల్నాడు జిల్లా నడికూడి జంక్షన్‌కు సమీపంలోని మాచర్ల ఓవర్ బ్రిడ్జి వద్దకు చేరుకుంటున్న సమయంలో గుర్తు తెలియని వ్యక్తులు చైన్ లాగారు. అప్పటికే రైల్లో ఉన్న కొందరు దొంగలు బోగీ తలుపులు తీశారు. ఆ ప్రాంతంలో మాటూ వేసిన దొంగలు బోగీలోకి ప్రవేశించి కొందరు మహిళల మెడలోని బంగారు ఆభరణాలు దోచుకునే ప్రయత్నం చేశారు. వారు కేకలు వేయడంతో బోగీలోని ఇతర ప్రయాణికులు లేచి దొంగల్ని అడ్డుకునే ప్రయత్నం చేశారు. ఈలోగా రైల్వే పోలీసులు దోపిడీ జరుగుతున్న బోగీలోకి వచ్చారు. వారిని చూసిన దొంగలు రైలు దిగి పారిపోయారు. ఆరు నుంచి ఏడుగురు దొంగలు ఈ దోపిడికి ప్రయత్నించినట్లు రైల్వే పోలీసులు చెబుతున్నారు.


హోం మంత్రి అనితకు స్వాగతం పలికిన టీడీపీ జిల్లా అధ్యక్షుడు గన్ని

హోం మంత్రి అనిత నారాయణపురం రాక

ఉంగుటూరు, ఆగస్టు 11: నారాయణపురంలో ఆదివారం జరిగిన జరిగిన ప్రైవేటు కార్యక్రమంలో హోం మంత్రి వంగలపూడి అనిత పాల్గొన్నారు. ఆమెకు టీడీపీ జిల్లా అధ్యక్షుడు గన్ని వీరాంజనేయులు, డీఎస్పీ శ్రావణ కుమార్ పుష్ప గుచ్ఛంతో స్వాగతం పలికారు. గన్ని వెంట తెలుగు యువత జిల్లా కన్వీనర్ రెడ్డి సూర్యచంద్రరావు, బీసీ సెల్ రాష్ట్ర ఆర్గనైజింగ్ కార్యదర్శి చింతల శ్రీనివాస్, బండారు మధు, సప్పా వీరబాబు, గన్ని గోపాలం తదితరులు ఉన్నారు.

బీజేపీని బలోపేతం చేయాలి : కేంద్ర మంత్రి వర్మ


బీజేపీ నాయకులతో శ్రీనివాసవర్మ

భీమడోలు, ఆగస్టు 11: బీజేపీని బలోపేతం చేసేందుకు ప్రతి కార్యకర్త కృషి చేయాలని కేంద్ర మంత్రి భూపతి రాజు శ్రీనివాసవర్మ పిలుపునిచ్చారు. భీమడోలులో ఆదివారం జరిగిన కార్యక్రమంలో పాల్గొన్న ఆయన స్థానిక బీజేపీ నేతలతో చర్చించారు. ఉంగుటూరు నియోజకవర్గ బీజేపీ కోకన్వీనర్ వెజ్జు ధర్మారావు కార్యాలయంలో బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గారపాటి సీతారామాంజనేయ చౌదరి, నాయకులతో భేటీ అయ్యారు. వీరరాఘవులు, వర్ధినీడి కపిరాజు, సత్యనారాయణ, మూర్తి, హనుమంతరావు, సుశీల, లాల్‌బహుదూర్‌శాస్త్రి, వెంకటసుబ్బారావు, నాయకులు పాల్గొన్నారు.

గంగానమ్మకు ఎమ్మెల్యే చంటి పూజలు


అమ్మవారి ఆలయంలో ఎమ్మెల్యే బడేటి చంటి

ఏలూరు కార్పొరేషన్, ఆగస్టు 11: దక్షిణపువీధి గంగానమ్మ ఆలయం వద్ద సంబరాలు ఘనంగా నిర్వహించారు. అమ్మవారికి అధిక సంఖ్యలో భక్తులు అభిషేకాలు, అర్చనలు నిర్వహించి నివేదనలు సమర్పించారు. ఎమ్మెల్యే బడేటి చంటి, జనసేన జిల్లా అధికార ప్రతినిధి రెడ్డి అప్పలనాయుడు ప్రత్యేక పూజలు చేశారు. నారా శేషు, నగిరెడ్డి కాశీ నరేష్, నరేష్, ఎం.సన్యాసిరావు, డి.పవన్, ఎ.రాజా, తదితరులు పాల్గొన్నారు.

● ఏలూరు రూరల్: శనివారపుపేట పడమరవీధి సెంటర్ గంగానమ్మ ఆలయంలో జాతర, స్నాన సంబరం ఆదివారం నిర్వహించారు. మహిళలు జ్యోతులను తలపై ఎత్తుకుని ఊరేగింపుగా ఆలయం వరకు తీసుకువచ్చి గంగానమ్మకు సమర్పించారు. ఉదయం అమ్మవారికి విశేష పూజలు అనంతరం చండీహోమం నిర్వహించారు. అనంతరం ప్రత్యేకంగా అలంకరించిన వాహనంపై అమ్మవారి చిత్రపటం ఉంచి మేళతాళాలు, విచిత్ర వేషధారణల నడుమ ఊరేగింపు నిర్వహించారు.

రాట్నాలమ్మకు ప్రత్యేక పూజలు


రాట్నాలమ్మకు మొక్కుతున్న భక్తులు

పెదవేగి, ఆగస్టు 11: రాట్నాలకుంట రాట్నాలమ్మకు ఆదివారం విశేష పూజలు నిర్వహించారు. సుదూర ప్రాంతాల భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు. అమ్మవారికి పాలపొంగలిని నైవేద్యంగా సమర్పించారు. అర్చకులు పావులూరి సత్యనారాయణ శర్మ, రుద్రపాక శేషగిరిరావు, పావులూరి పూర్ణయ్యశర్మ, చావలి సాయి అమ్మవారికి లలితా సహస్రనామ దేవీ ఖడ్గమాలార్చన నిర్వహించారు. పూజా టికెట్ల విక్రయాల ద్వారా రూ.50,910, లడ్డూ ప్రసాదాల విక్రయాలతో రూ.15వేలు, ఫోటో విక్ర యాల ద్వారా రూ.3440 ఆదాయం వచ్చిందని ఆలయ ఈవో ఎన్.సతీష్‌కుమార్ తెలిపారు. ఆలయ అభివృద్ధికి భక్తులు రూ.10,564 విరాళాలు ఇచ్చారని ఈవో తెలిపారు.

కోతకు గురైన పట్టిసీమ ఫెర్రీ


రేవు పరిశీలిస్తున్న కూటమి నాయకులు

పోలవరం ఆగస్టు 11: పట్టిసీమ అవుట్‌ఫాల్ స్లూయిజ్ నుంచి కొండవాగులు, కొవ్వాడ కాలువ జలాల తాకిడికి పట్టిసీమ ఫెర్రీ కోతకు గురైంది. రేవును జనసేన నాయకులు కరాటం రాంబాబు, కూటమి నాయకులు ఆదివారం పరిశీలించారు. స్లూయిజ్‌కి రిటైనింగ్ వాల్ నిర్మాణం చేసేలా చర్యలు తీసుకోవాలని స్థానిక నాయకులు కరాటం రాంబాబుని కోరారు. కుంచే దొరబాబు, పాపోలు రత్తయ్య, కొణతాల ప్రసాద్, చెంచాని రత్నప్రసాద్, వారాడి సత్తిబాబు, అమరాన్ పోసిబాబు, బీజేపీ నాయకులు కరిబండి నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

రౌడీషీటర్లు సత్‌ప్రవర్తనతో జీవించాలి


కౌన్సెలింగ్ ఇస్తున్న జంగారెడ్డిగూడెం సీఐ

ఏలూరు క్రైం/జంగారెడ్డిగూడెం, ఆగస్టు 11: రౌడీషీటర్లు సత్ ప్రవర్తనతో జీవించాలని, శాంతిభద్రతలకు భంగం కలిగిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని పోలీస్ అధికారులు హెచ్చరించారు. జిల్లాలోని అన్ని పోలీస్ స్టేషన్లు, సర్కిల్ కార్యాలయాలు, డీఎస్పీ కార్యాలయాల్లో ఆదివారం రౌడీషీటర్లకు కౌన్సెలింగ్ నిర్వహించారు. జంగారెడ్డిగూడెంలో సీఐ పి.రాజేష్ మాట్లాడుతూ రౌడీషీటర్లు అసాంఘిక కార్యకలాపాలకు దూరంగా ఉండాలని, లేకుంటే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఎస్సై జ్యోతిబసు ఉన్నారు.

వాహనాలకు నెంబర్ ప్లేట్ ఉండాల్సిందే

ఏలూరు క్రైం, ఆగస్టు 11 : జిల్లాలో ఆదివారం సాయంత్రం విస్తృతంగా విజిబుల్ పోలిసింగ్ నిర్వహించారు. నెంబర్ ప్లేటు లేని వాహనాలను సీజ్ చేస్తామని హెచ్చరించడంతో వాహనదారులు అప్పటికప్పుడే నెంబర్ ప్లేట్లను తయారు చేయించుకుని బిగించుకున్నారు. వాహనాలు నడుపుతున్న బాలురను గుర్తించి కౌన్సెలింగ్ ఇచ్చారు. నెంబర్ ప్లేట్లపై రాతలు, బొమ్మలున్నా వాహనాన్ని సీజ్ చేస్తామన్నారు. చట్ట వ్యతిరేక శక్తులను కట్టడి చేసేందుకు, రద్దీ ప్రాంతాల్లో నేరాలు, చైన్ స్నాచింగ్‌లు, మహిళలు, పిల్లలు, యువతులు వేధింపుల నియంత్రణ కోసం ఈ చర్యలు చేపట్టినట్లుగా అధికారులు తెలిపారు.

వరద బాధితులకు 'ఆత్మ బంధువులం' సహాయం


మాట్లాడుతున్న కొలనువాడ పెద కృష్ణంరాజు

వేలేరుపాడు, ఆగస్టు 11: పెదవాగు వరదతో నిరాశ్రయులైన అల్లూరి నగర్, కోయ మాధారం, ఉదయ్‌నగర్ గ్రామాల్లో తాడేపల్లిగూడెంకు చెందిన ఆత్మబంధువులం సంస్థ సహాయం అందించింది. 250 బాధిత కుటుంబాలకు బియ్యం, నిత్యావసరాలు, దుస్తులు, వంటపాత్రలు అందించారు. వరద బాధితుల సమస్యలను సీపీఐ ఎంఎల్ ప్రజాపంథా నాయకులు సిరికొండ రామారావు, మేడేపల్లి సర్పంచ్ రాంబాబు ఆ సంస్థ ప్రతినిధి సీతాశం ఉషాకిరణ్ దృష్టికి తీసుకెళ్లారు. వారు తక్షణమే స్పందించి తాడేపల్లిగూడెం వాసవి ఇంజనీరింగ్ కళాశాల చైర్మన్ గ్రంధి సత్యనారాయణ, కొలనువాడ కృష్ణంరాజు, బుద్దాల రామారావు, ఉద్దండం ఏసుబాబు, ఎన్‌ఐటీ విద్యార్థులు, ఇంజనీరింగ్ కళాశాల విద్యార్థుల తరపున బాధితులకు సహాయం అందించారు. బాధిత గ్రామాల్లో హ్యాండ్‌బోర్లు వేయిస్తామని కొలనువాడ పెద కృష్ణంరాజు హామీ ఇచ్చారు.

విశ్రాంత ఉద్యోగులు సమాజ సేవ చేయాలి : ఎమ్మెల్యే ధర్మరాజు

ఉంగుటూరు, ఆగస్టు 11: ఉద్యోగ విరమణ చేసిన వారంతా తమ శేష జీవితాన్ని సమాజసేవకు అంకితం కావాలని ఎమ్మెల్యే పత్సమట్ల ధర్మరాజు పిలుపునిచ్చారు. ఉద్యోగ విరమణ చేసిన కారెంశెట్టి రాంబాబు దంపతులను ఆదివారం ఆయన సత్కరించారు. ఎంతో మంది పిల్లలకు విద్యా బుద్ధులు చెప్పి సమాజానికి ఆదర్శంగా నిలిచారన్నారు. కార్యక్రమంలో సహాధ్యాయులు పాల్గొన్నారు.

ట్రాఫికర్

ఏలూరు నగరంలో ఎక్కడికక్కడ ట్రాఫిక్ జాం

ఉదయం, సాయంత్రం మరింత సమస్యాత్మకం


ఆర్ఆర్ పేటలో నిలిచిపోయిన వాహనాలు


విజయ విహార్‌సెంటర్‌లో ట్రాఫిక్ పరిస్థితి


ఆర్ఆర్ పేటలో అస్తవ్యస్తంగా వాహన రాకపోకలు

ఏలూరు క్రైం, ఆగస్టు 11 : జిల్లా కేంద్రమైన ఏలూరు నగరంలో ట్రాఫిక్ సమస్య జఠిలమైంది. నగర ప్రజలతో పాటు ఇతర ప్రాంతాల వారు ట్రాఫిక్‌తో హడలిపోతున్నారు. నిత్యం వందలాది భారీ వాహనాలు, వేలాది ద్విచక్ర వాహనాలు తిరుగుతూనే ఉంటాయి. నగరంలో భారీ వాహనాలకు ఉదయం 8 గంటల నుంచి 12 గంటల వరకూ సాయంత్రం 4 గంటల నుంచి రాత్రి 8 గంటల వరకూ ప్రవేశం లేదు. కానీ పోలీసులు చూసీ చూడనట్లు వ్యవహరించడంతో రోజంతా భారీ వాహనాలు యధేచ్ఛగా రాకపోకలు సాగించడంతో సమస్య తీవ్రమవుతోంది.

రోడ్లను మింగేస్తున్నారు

నగరంలో అసలే ఇరుకు రోడ్లు.. ఆపై వ్యాపారుల బోర్డులు సామగ్రితో మూసేస్తున్నారు. ఆర్ఆర్‌పేట, ఓవర్ బ్రిడ్జి దిగువ, ప్రభుత్వాసుపత్రి ముందు, వన్‌టౌన్ ప్రాంతంలో వ్యాపారులు రోడ్లను మింగేస్తున్నారు. చిరు వ్యాపారుల కూరగాయాలు, తోపుడు బండ్లు వాహన రాకపోకలకు అవరోధంగా మారాయి. కొన్ని హోటళ్లకు పార్కింగ్ లేకపోవడంతో రోడ్లనే వాహనాలు నిలుపుతున్నారు. గతంలో స్టాపర్లతో కొన్ని రోడ్లను విభజనగా పెట్టేవారు. కాని వ్యాపారుల సూచనతో తీసివేయడంతో ట్రాఫిక్ సమస్య జఠిలమైంది. నగరంలో ప్రచార హోర్డింగులతో ట్రాఫిక్ తలెత్తుతున్నానగర పాలక సంస్థ, ఆర్ అండ్ బి అధికారులు తీసుకుంటున్న చర్యలు శూన్యమే.

ఆటోలతో సమస్య

నగరంలో ఏ సెంటర్‌లో ఎన్ని ఆటోలు ఉండాలో అధికారులు ట్రాఫిక్ సీరియల్ నెంబర్లు ఇచ్చేవారు. ప్రస్తుతం ఈ విధానం లేకపోవడంతో నగరంలో ఆటోల సంఖ్య అధికమైంది. కొన్ని ఆటోలకు నెంబర్లు ఉండడం లేదు. ఎదురు వాహనదారులకు రోడ్డు కనిపించనంత ఫోకస్ లైట్లను ఆటోలకు బిగిస్తున్నారు. కొన్ని ఆటోలలో సౌండ్ సిస్టమ్, మెలోడి హారన్‌తో ఇతర వాహనదారులను హడలగొడుతున్నారు. కిరాయిల కోసం ఎక్కడబడితే అక్కడ అకస్మాత్తుగా ఆటోలను ఆపడంతో వెనుక వాహనదారులు ప్రమాదాలకు గురైన సంఘటనలు కోకొల్లలు. ప్రభుత్వాసుపత్రి వద్ద ఇరువైపులా ఆటోలను అడ్డంగా పార్కింగ్ చేస్తున్నారు. కోర్టు సెంటర్ వద్ద ఆర్ ఆర్‌పేట రోడ్లలో ఆటోలు అడ్డంగా ఉంచుతున్నారు. రోడ్డు మలుపులను తమ పార్కింగ్ ప్రదేశాలుగా మార్చేసుకున్నారు.

ట్రాఫిక్ సిబ్బంది కొరత

ఏలూరు ట్రాఫిక్ పోలీస్ స్టేషన్‌లో సిబ్బంది కొరత వేధిస్తుంది. ఉన్న సిబ్బందిని వివిధ డ్యూటీల నిమిత్తం పంపించడంతో ట్రాఫిక్ క్రమబద్ధీకరణలో సమస్య తప్పడం లేదు. సీఐ, ఇద్దరు ఎస్‌ఐలు, ఐదుగురు ఏఎస్‌ఐలు, 11 మంది హెడ్ కానిస్టేబుళ్లు, 39 మంది కానిస్టేబుళు ఉండాలి. ట్రాఫిక్ సీఐ త్రి టౌన్ సీఐగా ఇన్‌చార్జి బాధ్యతలో ఉన్నారు. ఎస్‌ఐ ఒక్కరు కూడా లేరు. ఐదుగురు కానిస్టేబుళ్ళ పోస్టులు ఖాళీ. 34 మంది కానిస్టేబుళ్ల ఇక్కడ పోస్టింగులు చూపిస్తున్నా 22 మంది వివిధ డ్యూటీలపై వేరే ప్రాంతాలకు పంపించారు. మిగిలిన 12 మంది కానిస్టేబుళ్ల మాత్రమే విధులు నిర్వర్తిస్తున్నారు. హోంగార్డులు కేవలం ఇద్దరు ఉన్నారు. గతంలో 50 ట్రాఫిక్ పాయింట్ల వరకూ ట్రాఫిక్ పోలీసులు విధులు నిర్వహించి ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరణ చేశారు. సిబ్బంది కొరతతో ప్రస్తుతం 15 పాయింట్లు మాత్రమే నగరంలో విధులు నిర్వర్తించగలుగుతున్నారు.

వ్యవసాయ ఉత్పత్తులకు

గిట్టుబాటు ధర సాధిస్తా

రైతులకు ఎంపీ పుట్టా మహేశ్ భరోసా


ఎంపీ పుట్టా మహేశ్‌ను సత్కరిస్తున్న పొగాకు రైతులు

ఏలూరు రూరల్/జంగారెడ్డిగూడెం, ఆగస్టు 11: అన్ని రకాల పంటలకు గిట్టుబాటు ధరలు సాధిస్తానని రైతులకు ఎంపీ పుట్టా మహేశ్ భరోసానిచ్చారు. రైతులు అదనంగా పండించిన పొగాకుపై ఎంపీ చొరవతో పెనాల్టీ రద్దు చేస్తూ కేంద్ర ప్రభుత్వం జీవో విడుదల చేసింది. ఈ నేపథ్యంలో పొగాకు రైతులు ఎంపీ పుట్టా మహేశ్ కుమార్‌ను ఏలూరు క్యాంప్ కార్యాలయంలో ఆదివారం సత్కరించారు. పొగాకు రైతు సంఘాల అధ్యక్షుడు పరిమి రాంబాబు, కరాటం రెడ్డి, కాకర్ల వివేకానంద్ తదితరులు మాట్లాడుతూ ఎంపీ కృషి ఫలితంగా జిల్లాలో 15వేల మంది పొగాకు రైతులు రూ.15 కోట్లు, రాష్ట్రంలో లక్ష మంది పొగాకు రైతులు 110కోట్లు లబ్ధిపొందారని చెప్పారు. ఎంపీ మాట్లాడుతూ రైతులకు గిట్టుబాటు ధర, యువతకు ఉపాధి, వేగంగా పోలవరం నిర్మాణం, నిర్వాసితులకు న్యాయం చేయాలని ప్రధాని మోదీని కోరినట్లు సమాచారం. త్వరలో కేంద్ర క్యాబినెట్ సమావేశంలో పోలవరం ప్రాజెక్టు నిర్మాణానికి రూ.12వేల కోట్లు మంజూరు కానున్నాయని ఆయన తెలిపారు. సెప్టెంబర్‌లో ఏలూరులో మెగా జాబ్‌మేళా నిర్వహిస్తామన్నారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే ఘంటా మురళి, పొగాకు రైతు నాయకులు సత్రం వెంకట్రావు, కె.శేషుబాబు, ఇల్లూరి రాంబాబు, శ్రీనివాసరావు, వామిశెట్టి హరిబాబు, కూచిపూడి రమేష్, వీవీఎస్.ప్రకాశరావు, అట్లూరి సతీష్, తదితరులు పాల్గొన్నారు.

● లింగపాలెం: గ్రామంలో సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని ఎంపీ పుట్టా మహేశ్ అన్నారు. కలరాయునిగూడెంలో ఒక కార్యక్రమంలో పాల్గొన్న ఎంపీకి స్థానిక నాయకులు పలు సమస్యలు విన్నవించారు. గ్రామంలో రోడ్లు, తాగునీటి సమస్యలు పరిష్కరిస్తామని, సమస్యల పరిష్కారానికి కృషిచేస్తానని అన్నారు.

వైసీపీ పాలన అస్తవ్యస్తం, అవినీతిమయం

పెదవేగి: వైసీపీ ఐదేళ్ల పాలన అస్తవ్యస్తం, అవినీతిమయంగా సాగిందని ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ అన్నారు. దుగ్గిరాల ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో ఆదివారం ఆయన ప్రజల నుంచి ఫిర్యాదులు స్వీకరించారు. పేదలకు ఇళ్లు అంటూ పార్టీ రంగేసుకున్న వారికే ఇంటిస్థలం ఇచ్చారని, అర్హులకు అన్యాయం జరిగిందన్నారు. కొన్నిచోట్ల నివాసానికి ఉపయోపడని, పనికిరాని లేఅవుట్‌లు వేసి ప్రజల సొమ్ము దోచుకున్నారని ఆయన ఆరోపించారు. వైసీపీ ఒత్తిళ్ళకు తలొగ్గి అధికారులు వ్యవస్థలను నిర్వీర్యం చేశారని, అక్రమాలను వెలికితీసి, అవినీతిపరులు తిన్న మొత్తాన్ని కక్కిస్తామని ప్రభాకర్ స్పష్టం చేశారు. నాయకులు బొప్పన సుధాకర్, తాతా సత్యనారాయణ, మాగంటి నారాయణ ప్రసాద్, లావేటి శ్రీనివాసరావు, నంబూరి నాగరాజు పాల్గొన్నారు.


ఫిర్యాదులను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్

డిగ్రీ కాలేజీ ఏర్పాటుకు కృషి : ఎమ్మెల్యే బాలరాజు

కొయ్యలగూడెం: స్థానికంగా డిగ్రీ కాలేజీ ఏర్పాటుకు కూటమి ప్రభుత్వంలో సాధ్యం చేస్తామని ఎమ్మెల్యే చిర్రి బాలరాజు హామీ ఇచ్చారు. ప్రభుత్వ జూనియర్ కాలేజీలో పూర్వ విద్యార్థులు ఏర్పాటుచేసిన సరస్వతి విగ్రహాన్ని ఆదివారం డీసీసీబీ మాజీ చైర్మన్ కరాటం రాంబాబు ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ ఎంతో కాలంగా డిగ్రీ కాలేజీ కలగానే మిగిలిపోయిందని, కానీ తమ ప్రభుత్వంలో ఏర్పాటుచేసి చూపిస్తామని హామీ ఇచ్చారు. కొయ్యలగూడెం ప్రభుత్వ ఆసుపత్రి అభివృద్ధి చేస్తామన్నారు. అనంతరం ఎస్సీ హాస్టల్స్‌ను సందర్శించి విద్యార్థులతో మాట్లాడారు. కరాటం సాయి, బొల్లిన నిర్మలకిషోర్, వెంకటరమణ, మాదేపల్లి శ్రీను, తోట రవి, దుగ్గిన శ్రీను, నక్కా బాబి, పూర్వ విద్యార్థులు సత్యనారాయణ, దీక్షితులు, మంతెన సోమరాజు, గంటా శ్రీను, తదితరులు పాల్గొన్నారు.

ఎస్సీ, ఎస్టీలకు చట్ట భద్రత కల్పించాలి


సమావేశంలో దళితసేన నాయకులు

ఏలూరు రూరల్, ఆగస్టు 11: రాష్ట్రంలో ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ చట్టాన్ని పటిష్ఠంగా అమలు చేయాలని దళితసేన అధ్యక్షుడు జుజ్జువరపు రవిప్రకాష్ డిమాండ్ చేశారు. సంఘ భవనంలో దళితసేన మహిళా అధ్యక్షురాలు లావేటి ప్రవల్లిక అధ్యక్షతన ఆదివారం సమావేశం జరిగింది. బాధితుల ఫిర్యాదులపై ఎఫ్‌ఐఆర్ నమోదు చేయకుండా విచారణ పేరుతో జాప్యం చేస్తున్నారని ఆరోపించారు. అట్రాసిటీ చట్టం ఫిర్యాదులపై తక్షణం ఎఫ్‌ఐఆర్ నమోదుకు ఎస్పీ స్థాయి అధికారులు ఆదేశాలు ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. అట్రాసిటీ కేసులు చాలావరకు పెండింగ్ ఉన్నాయని, వాటిపై దృష్టిసారించాలని విజ్ఞప్తి చేశారు. సమావేశంలో లక్ష్మి, మధులత, దళిత సేన కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

లక్ష్మక్క మృతి రైతు కూలీ సంఘానికి తీరనిలోటు

టి.నరసాపురం, ఆగస్టు 11: మర్రిగూడెం ప్రాంత భూపోరాటాల్లో ముఖ్య పాత్ర పోషించిన రైతుకూలీ సంఘం నాయకురాలు లక్ష్మి అలియాస్ లక్ష్మక్క మృతి తీరని లోటని జిల్లా నాయకులు అన్నారు. మర్రిగూడెంలో మృతి చెందిన లక్ష్మక్కకు సంఘం నాయకులు ఆదివారం నివాళులర్పించారు. రైతు కూలీ సంఘం నాయకత్వంలో జరిగిన భూపోరాటాల ఫలితమే నేడు మర్రిగూడెం ప్రాంతంలో ఆరు గ్రామాల గిరిజనులు భూములను సాగు చేసుకుంటున్నారన్నారు. లక్ష్మక్క ప్రాణాలకు తెగించి పోరాటం చేశారన్నారు. జిల్లా కమిటీ సభ్యులు కొండరాము, జంగారెడ్డిగూడెం డివిజన్ కార్యదర్శి బత్తుల బాబురావు, తుట్టి నాగేశ్వరరావు, గడ్డం కాటయ్య కనకయ్య పాల్గొన్నారు.

458 మందికి వైద్య పరీక్షలు

ఏలూరు కార్పొరేషన్, ఆగస్టు 11: అగ్రహారం కెనాల్ రోడ్డులోని గాంధీ ఆంధ్ర జాతీయ మహా విద్యాలయం ప్రాంగణంలో ఆదివారం వైద్య శిబిరం నిర్వహించారు. వైద్యులు గోపాలం శివన్నారాయణ, వంశీ, కోమలి, యశ్వంత్ 458 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి మందులు అందజేశారు. జీబీఆర్ ఫౌండేషన్, లయన్స్ క్లబ్, జన విజ్ఞాన వేదిక, రెడ్‌క్రాస్ సంయుక్తంగా వైద్య శిబిరాన్ని నిర్వహించినట్టుసాయిరాజు బల్లం, వెంకటస్వామి తెలిపారు.

బొర్రంపాలెంలో కంటి వైద్య శిబిరం

టి.నరసాపురం, ఆగస్టు 11: బొర్రంపాలెంలో ఫర్ ద పీపుల్ యూత్ ఆధ్వర్యంలో ఆదివారం పాఠశాల ఆవరణలో ఉచిత కంటి వైద్యశిబిరం నిర్వహించారు. నిడదవోలు కంటి వైద్యనిపుణులు రాజేశ్వరి, రామకృష్ణ లయన్స్ నేత్ర వైద్యశాల సిబ్బంది సుమారు వంద మందికి పరీక్షలు నిర్వహించారు. 20 మందికి పైగా ఆపరేషన్లు అవసరమని వైద్యులు గుర్తించారు. వారికి ఉచితంగా ఆపరేషన్లు చేస్తామని వైద్యులు తెలిపారు. ఫర్ ద పీపుల్ యూత్ ఆర్గనైజర్ కలపర్తి విజయ్ మాట్లాడుతూ తమ సంస్థ ద్వారా అనేక సేవా కార్యక్రమాలు చేపడుతున్నామని వివరించారు. రానున్న రోజుల్లో మరిన్ని వైద్య శిబిరాలు నిర్వహిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో రేశ్ల మోషే, గుండె ప్రవీణ్‌కుమార్, రవి, గాంధీ, వీర్రాజు, సురేష్, మోషే తదితరులు పాల్గొన్నారు.

గ్రంథాలయాలు విజ్ఞాన భాండాగారాలు


పుస్తక పఠనంలో విద్యార్థులు

పెదవేగి, ఆగస్టు 11: గ్రంథాలయాలు విజ్ఞాన భాండాగారాలని లైబ్రేరియన్ తోట అరుణ్‌కుమార్ అన్నారు. పెదవేగి శాఖా గ్రంథాలయంలో ఆదివారం చదవడం మాకిష్టం కార్యక్రమం నిర్వహించారు. పలువురు విద్యార్థులు గ్రంథాలయానికి వచ్చి పుస్తకాలను చదివారు. గ్రంథ పఠనంతో కలిగే లాభాలను అరుణ్‌కుమార్ వివరించారు. ప్రతి విద్యార్థి తప్పనిసరిగా పుస్తకాలు చదవాలని, అదే వారి జీవితాన్ని ఉన్నతమైన దిశగా నడిపిస్తుందని ఆయన తెలిపారు.

ప్రతి ఇంటా మువ్వన్నెల జెండా ఎగరాలి


దర్భగూడెంలో సమావేశమైన నాయకులు

జీలుగుమిల్లి, జూలై 11: ప్రతి ఇంటా మువ్వన్నెల జెండా రెపరెపలాడాలని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు బొరగం వెంకట లక్ష్మి అన్నారు. దర్భగూడెంలో హర్ ఘర్ తిరంగ కార్యక్రమంలో భాగంగా కేతిరెడ్డి నెహ్రూరెడ్డి ఇంటి వద్ద ఆదివారం సమావేశం నిర్వహించారు. హర్ ఘర్ తిరంగ కార్యక్రమం విజయవంతం చెయ్యాలని మండల అధ్యక్షులు కొండపల్లి ప్రసాద్ అన్నారు. ప్రజల్లో దేశ భక్తి పెంపొందించేందుకు ప్రజల అవగాహన కల్పించాలని పార్టీ కార్యకర్తలకు చెప్పారు. బీజేపీ జిల్లా కార్యదర్శి చాత్రాతి ప్రసాద్, పి.సుబ్బారెడ్డి, యు.శ్రీనివాసరావు, కె.రాజకుమారి, జి.ప్రసాద్ రాము, తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ డిగ్రీ కళాశాల పూర్వ విద్యార్థుల కమిటీ

చింతలపూడి, ఆగస్టు 11: స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల పూర్వ విద్యార్థులతో కమిటీ ఏర్పాటు చేశారు. ప్రిన్సిపాల్ టి.శ్రీనివాసరావు, వైస్ ప్రిన్సిపాల్ ఎస్.నరేంద్రకుమార్ ఆధ్వర్యంలో ఆదివారం సమావేశం నిర్వహించారు. కళాశాల అభివృద్ధికి పూర్వ విద్యార్థులు, సూచనలు, సలహాలు ఇవ్వాలని, త్వరలో నాక్‌టీమ్ కళాశాలను సందర్శించనుందని తెలిపారు. పూర్వ విద్యార్థుల సంఘం గౌరవ అధ్యక్షుడిగా టీఎస్‌వీ కుమార్, అధ్యక్షుడిగా డి.రాజశేఖర్, కార్యదర్శిగా కె.శ్రీనివాస్, కోశాధికారిగా బి.రమేష్, ఉపాధ్యక్షులుగా ఎస్.కె ఫకీర్, ఎన్.సుజాత, కె.రాజా, సహాయ కార్యదర్శులుగా పానుగంటి సత్యనారాయణ, కె.ప్రియాంక, టి.బాబు, 10 మంది సభ్యులను ఎన్నుకున్నారు.

రేపు హైదరాబాద్‌లో ఎమ్మార్పీఎస్ సభ

ఏలూరు రూరల్, ఆగస్టు 11: హైదరాబాద్‌లో ఈనెల 13న జరిగే ఎమ్మార్పీఎస్ సభ విజయవంతం చేయాలని ఎంఎస్‌పి జిల్లా అధ్యక్షుడు కందుల రమేష్ పిలుపునిచ్చారు. రిజర్వేషన్ వర్గీకరణ విజయోత్సవ ర్యాలీ జరుగుతుందన్నారు. ప్రస్తుతం జరిగే ఉద్యమం సరికొత్త వ్యూహంతో ముందుకు వెళ్ళాల్సిన అవసరం ఉందన్నారు. ప్రతి ఒక్కరూ హైదరాబాద్ సభకు తరలి రావాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

కదిలే స్పీడ్ బ్రేకర్స్


వసంతమహల్ సెంటర్‌లో రోడ్డుకు అడ్డుగా పశువులు

నగరంలోని పలుచోట్ల ప్రధాన రహదారులపై రోడ్డుకు అడ్డుగా పశువులు స్పీడ్ బ్రేకర్స్‌గా ఉన్నాయి. రేయింబవళ్లు రోడ్లపై ఉండడంతో వాహనదారులు ప్రమాదాల బారిన పడుతున్నారు. పాండురంగ సెంటర్, సత్యనారాయణ సెంటర్, వసంతమహల్ సెంటర్, తహసీల్దార్ కార్యాలయం మలుపు, బావిశెట్టివారిపేట చాటపర్రు రోడ్డులో పశువులు రహదారులపైనే మందలుగా ఉంటున్నాయి. ఆయా ప్రాంతాల ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. అధికారులు తోణం స్పందించి పశువులు రహదారులపై ఉండకుండా చర్యలు తీసుకోవాలని పశువుల యజమానులను హెచ్చరించాలని పలువురు కోరుతున్నారు. - ఏలూరు కార్పొరేషన్

రోడ్డుపై గండికి మోక్షం


గండి పూడ్చడంతో మెరుగుపడిన రోడ్డు

గండిజర్ల వద్ద ఆర్అండ్‌బి రోడ్డుపై గండిని పూడ్చడంతో విద్యార్థులకు రవాణా సౌకర్యం కలిగింది. ఇటీవల భారీ వర్షాలకు పాలవాగు పొంగి రోడ్డుకు గండిపడింది. కాంతంపాలెం నుండి కమలాపురం వరకు ఉన్న గ్రామాల విద్యార్థులు రాఘవాపురం, చింతలపూడి పాఠశాలలకు వెళ్లడానికి ఇబ్బందులు పడ్డారు. తాత్కాలికంగా గండిపూడ్చినా ఫలితం ఉండదని గ్రామస్తులు ఎమ్మెల్యే రోషన్‌కుమార్ దృష్టికి తీసుకువెళ్లారు. ఆయన ఆర్అండ్‌బి అధికారులను అప్రమత్తం చేసి భారీ తూరలు వేసి రెండురోజుల్లోనే గండిని పూడ్చారు. విద్యార్థులకు రవాణా సౌకర్యం మెరుగు పడింది. విద్యార్థులు ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలిపారు. - చింతలపూడి


మల్కాపురంలో నాట్లు వేస్తున్న మహిళలు

జోరుగా వరి నాట్లు

ఏలూరు రూరల్, ఆగస్టు 11: రూరల్ మండలంలో వరి నాట్లు జోరందుకున్నాయి. వరి నారు సిద్ధంగా ఉండడం, వర్షాలతో సాగు నీరు పుష్కలంగా అందడంతో నాట్లు ముమ్మరంగా వేస్తున్నారు. మల్కాపురం, సుంకరవారి తోట, మాదేపల్లి, చాటపర్రు, జాలిపూడి, కాట్లంపూడి, కోణంగి తదితర ప్రాంతాల్లో పుష్కలంగా నీరు చేరింది. పాలగూడెం దిగువప్రాంతంలో నీరందక సుమారు 600 ఎకరాలు బీటలు వారింది. వర్షాలతో ఆయకట్టుకు నీరు విడుదల చేశారు. ముందుగానే దమ్ములు పట్టి నాట్లు ప్రారంభించారు. వర్షపునీటితోనే చాలావరకు దమ్ములు పూర్తికావచ్చని రైతులు చెబుతున్నారు.


ముంజులూరు రోడ్డుపై గోతులను పూడ్చుతున్న కూలీలు

ముంజులూరు రోడ్డుపై గోతులు పూడ్చివేత

బుట్టాయగూడెం, ఆగస్టు 11: ఏజెన్సీలో ఇటీవల కురిసిన భారీ వర్షాలకు ముంజులూరు-పులిరాముడుగూడెం గ్రామాల మధ్య బిటి రోడ్డు దెబ్బతింది. కొండవాగుల ఉధృతికి రోడ్డు కొట్టుకుపోయింది. రోడ్డుపై పలు చోట్ల పెద్దపెద్ద గోతులు పడ్డాయి. గోతులు కారణంగా వాహనాలు రాకపోకలకు అవకాశం లేకుండా పోయింది. గిరిజన గ్రామాల ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ముంజులూరులో సోమవారం జరిగే వైద్యశిబిరం ప్రారంభానికి జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి వెళ్లాల్సి ఉంది. దీనితో సర్పంచ్ కెచ్చెల ముక్కారెడ్డి ఆదివారం కూలీలతో రోడ్డుపై గోతులను పూడ్పించి వాహనం వెళ్లేలా మార్గాన్ని ఏర్పాటు చేశారు.

సంక్షిప్త సమాచారం..

- **చింతలపూడి** : ఏఐటీయూసీ జాతీయ సమ్మేళన పోస్టర్‌ను జిల్లా ఉప ప్రధాన కార్యదర్శి కె.బాబు ఆదివారం ఆవిష్కరించారు. విశాఖలో సెప్టెంబర్ 2,3 తేదీల్లో జరిగే ఏఐటీయూసీ జాతీయ సమ్మేళనం కార్మికులు జయప్రదం చేయాలన్నారు. విజ్ఞేష్, బజంత్రీ శ్రీనివాస్ పాల్గొన్నారు.
- **లింగపాలెం** : అగ్నిప్రమాదంలో బాధిత కుటుంబానికి రోషన్‌కుమార్ అండగా నిలిచారు. సుందర్‌రావుపేటలో పొదిల ప్రసాద్ కుటుంబానికి రూ.10వేలు స్థానిక నాయకుల ద్వారా అందజేశారు. జాస్తి శ్రీనివాసరావు, ఘంటా నాగరాజేంద్రరావు, ఘంటా కేశవప్రసాద్ పాల్గొన్నారు.
- **పోలవరం** : మహాత్మా గాంధీ వృద్ధాశ్రమంలో లంక సూర్య అప్పాజీ కుమారుడు విజయ్ నాగవేదాన్స్ పుట్టినరోజు సందర్భంగా వృద్ధులకు భోజనం ఏర్పాటు చేశారు. వాడపల్లి నాగరాజు, షెహినా బాషా, లంక అన్నపూర్ణ, సత్యవతి, చెంచాని బుజ్జి, తదితరులు పాల్గొన్నారు.
- పోలవరం జనసేన నాయకుడు గునపర్తి చిన్ని తీవ్ర అస్వస్థతతో రాజమహేంద్రవరంలో ప్రైవేటు ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. కరాటం రాంబాబు ఆస్పత్రికి వెళ్ళి చిన్ని ఆరోగ్య పరిస్థితి తెలుసుకున్నారు. మాజీ ఎమ్మెల్యే మొడియం శ్రీనివాస్, కొణతాల ప్రసాద్, తెలగంశెట్టి రాంప్రసాద్, చెంచాని రత్నప్రసాద్, వారాడి సత్తిబాబు ఉన్నారు.
- **జంగారెడ్డిగూడెం** : విజయవాడలో ఆదివారం జరిగిన జాతీయస్థాయి కుంగ్‌ఫూ పోటీలలో పట్టణానికి చెందిన విద్యార్థులు 15 మంది పాల్గొన్నారు. ఆరుగురు ప్రథమ, ఐదుగురు ద్వితీయ, ఒకరు తృతీయ స్థానం సాధించినట్లు మాస్టర్ గంధం సురేష్ తెలిపారు.
- **నిడమర్రు** : ఎస్ఐగా ఎన్.వీరప్రసాద్ ఆదివారం బాధ్యతలు స్వీకరించారు. మచిలీపట్నం నుంచి నిడమర్రు బదిలీపై వచ్చారు. ఇక్కడ ఎస్ఐ ఆర్.శ్రీను జిల్లా పోలీసు కార్యాలయానికి బదిలీ అయ్యారు.


ఇళ్లు నిర్మించని ముక్కొల్లుపాడు జగనన్న కాలనీ


ముసునూరు జగనన్న లేఅవుట్‌లో పిచ్చిమొక్కలు


మండవల్లి కాలనీలో కనీస వసతుల్లేక నిర్మాణాలు చేపట్టని దృశ్యం


మల్రిబంధంలో నిర్మాణ దశలోనే ఇళ్లు


కలిదిండిలో కాలనీకి వెళ్లే మట్టి రోడ్డు

బాబోయ్ ఉండలేం!

- మౌలిక వసతుల్లేని జగనన్న కాలనీలు
- పిచ్చి మొక్కలు మొలిచి చిట్టడవులను తలపిస్తున్న స్థలాలు
- పలు చోట్ల నీటి సౌకర్యం లేక ప్రారంభం కాని నిర్మాణాలు
- నిర్మాణాలు జరిపిన చోట బురదకయ్యగా రహదారులు..
- ఇళ్ల నిర్మాణానికి లబ్ధిదారుల విముఖత
- ముసునూరు మండలంలో పలువురు పట్టాలు తీసుకోని వైనం

నిరుపేదల సొంతింటి కల సాకారానికి కోట్లాది రూపాయలతో జగనన్న కాలనీలను నిర్మిస్తున్నామంటూ గత ప్రభుత్వం ఎంత ప్రచారం చేసినా కాలనీలు ఊళ్లకు దూరంగా నివాస యోగ్యం కాని ప్రదేశాల్లో ఇవ్వడంతో లబ్ధిదారులు కనీసం కాలనీల వైపు కన్నెత్తి చూడటం లేదు. పైగా మౌలిక వసతులు గురించి పట్టించుకోలేదు. దీంతో రహదారులు వానొస్తే బురదమయమే. ఇక పలుచోట్ల నీటి సౌకర్యం లేదు. దీంతో ఇళ్ల నిర్మాణానికి లబ్ధిదారులు ముందుకు రావడం లేదు. కొన్ని చోట్ల లబ్ధిదారులు ఇళ్ల నిర్మాణాలు చేపట్టగా ఎక్కువ శాతం మంది నిర్మాణాలకు దూరంగా ఉన్నారు. గత ప్రభుత్వం కేవలం ప్రచారార్భాటాలకే నివాస యోగ్యం కాని స్థలాలు కేటాయించిందని లబ్ధిదారులు మండిపడుతున్నారు.

ఒక్కరూ ఇంటి నిర్మాణం చేపట్టలేదు!

నూజివీడు టౌన్: నూజివీడు మండలం ముక్కొల్లుపాడు, బోర్వంచ గ్రామాల్లోని కాలనీల్లో ఒక్కరు కూడా ఇంటి నిర్మాణాలకు ఆసక్తి చూపలేదు. ముక్కొల్లుపాడులో ఊరికి దూరంగా బూడిద గట్టుపై సుమారు 150 మందికి నివేశన స్థలాలు ఇవ్వడంతో పాటు గత ప్రభుత్వ హయాంలో అక్కడే సచివాలయం నిర్మించింది. కాలనీల్లో మౌలిక సదుపాయాల కల్పన సక్రమంగా లేకపోవడంతో నాటి నుంచి నేటి వరకు కాలనీ పిచ్చి మొక్కలకు నిలయంగా మారింది. ఇటు బోర్వంచ గ్రామంలోను గట్టుపై నివేశన స్థలాలు ఇవ్వడంతో ఇళ్ల నిర్మాణంకు లబ్ధిదారులు విముఖత చూపారు.

చిట్టడవులను తలపిస్తున్నాయ్!

ముసునూరు: ముసునూరు మండల వ్యాప్తంగా గత వైసీపీ ప్రభుత్వంలో వేసిన జగనన్న లేఅవుట్లు చిట్టడవులను తలపిస్తున్నాయి. కనీస సదుపాయాల కల్పన లేకపోవడంతో ఇళ్ల నిర్మాణాలు జరగలేదు. కొన్ని గ్రామాల్లో చెరువులు, వాగులు పూడ్చి లే అవుట్లు వేశారు. మరికొన్ని చోట్ల గ్రామాలకు సుమారు మూడు కిలోమీటర్ల దూరంలో లేఅవుట్లు వేయడంతో లబ్ధిదారులు స్థలాల పట్టాలను తీసుకోలేదు. మండలంలో 16 గ్రామాల్లో 2609 మందిని అర్హులుగా గుర్తించారు. వీరికి ఇళ్లస్థలాలకు జగనన్న కాలనీల పేరుతో 25 లేఅవుట్లు వేశారు. వీటిలో ముసునూరు-2, అక్కిరెడ్డిగూడెం-1, గోపవరం-1, చెక్కపల్లి-1, యల్లాపురం-1 మొత్తం 6 లేఅవుట్లు కోర్టులో ఉండగా నేటికీ వీటిపై తీర్పు రాలేదు. ముసునూరులో కొంత మంది లబ్ధిదారులకు సంధ్యవాగు వద్ద భూమిని ఎకరం రూ. 25 లక్షల చొప్పున 8 ఎకరాల భూమిని కొనుగోలు చేసి, లే అవుట్ వేయగా పట్టాలు తీసుకునేందుకు లబ్ధిదారులు నిరాకరించారు. అలాగే గోపవరంలో వాగు పోరంబోకులో వేసిన లేఅవుట్ వరదనీటి ముంపునకు గురవడంతో మొత్తం లబ్ధిదారులు 60 మందీ పట్టాలు తీసుకోలేదు. మిగిలిన లేఅవుట్లలో విద్యుత్, నీరు తదితర సౌకర్యాలు లేకపోవడంతో లబ్ధిదారులు ఇళ్ల నిర్మాణాలు చేపట్టలేదు. 1709 మంది లబ్ధిదారులకు పట్టాలు మంజూరు చేయగా లోపూడి, కొర్లకుంట, చెక్కపల్లి, బలివే గ్రామాల్లో అరకొరగా సుమారు 60 ఇళ్ల నిర్మాణాలు పూర్తయ్యాయి. విద్యుత్ సౌకర్యం లేకపోవడంతో గృహప్రవేశాలు జరగలేదు. అయితే ప్రస్తుతం లేఅవుట్లలో ముళ్లకంచెలు, పిచ్చిమొక్కలు, చెత్తాచెదారంతో దర్శనమిస్తున్నాయి. నివాసాలకు అనుగుణంగా లేని ఇళ్ల స్థలాలను ఇచ్చారని గత ప్రభుత్వ పనితీరుపై లబ్ధిదారులు మండిపడుతున్నారు. ఈ కూటమి ప్రభుత్వం గ్రామాల పరిధిలో నివాస స్థలాలు కేటాయించి, ఇళ్ల నిర్మాణాలకు ఆర్థికంగా చేయూతను అందించాలని పేదోడి ఇంటి కలను సాకారం చేయాలని లబ్ధిదారులు కోరుతున్నారు.

నీళ్ళు లేకుండా నిర్మాణం ఎలా..?

చాట్రాయి: జగనన్న లేఅవుట్లు అన్నీ ఊరికి దూరంగానే ఉన్నాయి. వీటికి ముందుగా విద్యుత్, నీటి వసతి రోడ్లు మొదలైన మౌలిక సదుపాయాలు కల్పించి ఇళ్ళు మంజూరు చేస్తే లబ్ధిదారులు ఇళ్ళు నిర్మించుకోటానికి ఇబ్బందులు ఉండేవి కావు. కానీ వైసీపీ ప్రభుత్వం మౌలిక వసతులు లేని స్థలాలలో ఇళ్ళు మంజూరు చేసి లబ్ధిదారులను కష్టాల పాలు చేసింది. లబ్ధిదారులు ఇళ్ళు కట్టుకోటానికి దూరంగా వ్యవసాయ బోర్లు నుంచి నీళ్ళు మోసుకుంటూ నరకయాతనలు అనుభవిస్తున్నారు. ఇళ్ళు పూర్తి అయినవారు గృహ ప్రవేశాలు చెయ్యాలంటే నీళ్ళు ఎట్లా అని భయపడుతున్నారు. మండలంలో 18 గ్రామాల పరిధిలో 35 జగనన్న లే అవుట్లు వేసి 1730 మందికి పట్టాలు యిచ్చారు. వీరిలో 240 మందికి పక్కా ఇళ్ళు మంజూరు చేశారు. ఇందులో 40 ఇళ్ళు పూర్తి కాగా 110 ఇళ్ళు వివిధ దశల్లో ఉన్నాయి. కొన్ని నెలల నుంచి జగనన్న కాలనీలకు విద్యుత్ లైన్లు వేస్తున్నారు. లేఅవుట్లలో కొన్నేళ్ళ కింద వేసిన గ్రావెల్ రోడ్లు పాడైపోయాయి. కొత్త ప్రభుత్వం లేఅవుట్లలో మౌలిక సదుపాయాలు కల్పించి సమస్యలు పరిష్కరించాలని లబ్ధిదారులు కోరుతున్నారు.

170కు కేవలం 6.. అవీ పునాదుల వరకే నిర్మాణం!

మండవల్లి: జగనన్న కాలనీలో స్థలాల పొందిన లబ్ధిదారుల పరిస్థితి అగమ్యగోచరంగా మారింది. ఊరికి సంబంధం లేకుండా దూరంగా స్థలాలు కేటాయింపు చేయడం అక్కడ మౌలిక వసతులపై పట్టించుకోకపోవడం లబ్ధిదారుల పాలిట శాపంగా మారింది. ఆర్భాటంగా విద్యుత్‌లైన్లు ఏర్పాటు చేశారు కానీ రహదారులు కానీ, మంచినీటి సౌకర్యం కల్పించకపోవడంతో ఇళ్ల నిర్మాణాలు జరగలేదు. 170 మంది లబ్ధిదారులకు స్థలాలివ్వగా కేవలం 6 ఇళ్లు పునాదుల దశకే పరిమితమయ్యాయంటే పరిస్థితిని అర్థం చేసుకోవచ్చు. గృహ నిర్మాణాలు చేపట్టేందుకు కనీసం రహదారులు కూడా లేకపోవడంతో చినుకు పడితే చాలు అంతా బురద మయం అవుతుంది. దీంతో గృహనిర్మాణం మెటీరియల్ రవాణా చేయలేక అవస్థలు పడుతున్నారు. నిర్మాణాలు కూడా అసంపూర్తిగా నిలిచిపోయాయి. మండవల్లి తహసీల్దార్ కార్యాలయం సమీపంలో కేటాయంచిన నివేశ స్థలంలో నిర్మాణం చేపట్టేందుకు కనీసం లబ్ధిదారులు ముందుకు రావడం లేదు. ఇది కేవలం జగన్ ప్రభుత్వం తీసుకున్న అనాలోచిత విధానాలు గ్రామానికి సంబంధం లేకుండా దూరంగా కేటాయింపులు వల్ల కాలనీలో మౌలిక వసతుల కల్పన సాధ్యపడుతుందా అన్న భయాందోళన లబ్ధిదారులు నుంచి వ్యక్తం అవుతోంది.


కలిదిండి కాలనీలో సగం వరకే నిర్మించి వదిలేసిన ఇళ్లు

వానొస్తే చెరువులే..!

కలిదిండి: జగనన్న కాలనీలో సమస్యలు వెల్లువెత్తుతున్నాయి. మొత్తం 23 గ్రామపంచాయతీలో 40 జగనన్న కాలనీలు ఉండగా, ఏ ఒక్క కాలనీ కూడా వంద శాతం ఇంత వరకు పూర్తి కాలేదు. వర్షం వస్తే నీటమునిగి చెరువులను తలపిస్తున్నాయి. ఊరి బయట నివాస యోగ్యం కానీ ప్రదేశాలలో లే అవుట్లు వేయడంతో లబ్ధిదారులు పక్కా గృహాలు నిర్మించుకోవటానికి ఆసక్తి చూపటం లేదు. కలిదిండి జగనన్న కాలనీలో 19 ఎకరాల విస్తీర్ణంలో 755 ప్లాట్లు వేశారు. వీటిలో 26 ఇళ్లు బేస్‌మెంట్ దశలో ఉండగా, స్లాబ్ లెవల్‌లో 3 ఇళ్లు ఉన్నాయి. ఈ కాలనీలో మూడు పక్కా ఇళ్లు మాత్రమే పూర్తయ్యాయి. జగనన్న కాలనీకి వెళ్లే ప్రధాన రహదారి గోతులు పడి అధ్వానంగా ఉండటంతో చిన్నపాటి వర్షానికే బురదకయ్యగా మారుతోంది. దీంతో కాలనీలోకి ఇళ్ల నిర్మాణ మెటీరియల్ తీసు కెళ్లటానికి కష్టతరంగా మారింది. దీంతో జగనన్న కాలనీలో ఇళ్ల నిర్మాణం నత్తనడకన సాగుతోంది. లే అవుట్‌ను అసంపూర్తిగా పూడ్చారు. మరో మూడు అడుగుల మేర పూడ్చాలి. కొద్దిపాటి వర్షానికి నీట మునిగి చెరువును తలపిస్తుండటంతో లబ్ధిదారులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.


సంజయ్‌కుమార్‌ను సత్కరిస్తున్న మంత్రి అనిత

సైనికుల సేవలు వెలకట్టలేనివి

రాష్ట్ర హోం మంత్రి అనిత, కేంద్ర మంత్రి వర్మ

పెంటపాడు, ఆగస్టు 11 : సైనికుల సేవలు వెలకట్టలేనివని రాష్ట్ర హోం మంత్రి అనిత, కేంద్ర మంత్రి వర్మ అన్నారు. టీబీఆర్ సంస్థ అధినేత తనుబుద్ది భోగేశ్వరరావు ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన కార్గిల్ విజయ దివస్ రజతోత్సవంలో వారు పాల్గొన్నారు. అలంపురం టీబీఆర్ సైనిక్ స్కూల్ వద్ద జాతీయ జెండాను ఆవిష్కరించి, అమరవీరుల విగ్రహానికి నివాళులర్పించారు. అనంతరం ఏపీ నిట్ ప్రాంగణంలో జరిగిన కార్యక్రమంలో మంత్రి అనిత మాట్లాడుతూ తన దృష్టికి వచ్చిన మాజీ సైనికుల సమస్యలను సీఎం చంద్రబాబుతో మాట్లాడి పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. మరో ముఖ్య అతిథి కేంద్రమంత్రి భూపతిరాజు శ్రీనివాస వర్మ మాట్లాడుతూ సైనికుల సేవల వల్లే దేశ ప్రజలందరూ సుఖ శాంతులతో జీవిస్తున్నారన్నారు. ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్, ఉంగుటూరు ఎమ్మెల్యే పత్సమట్ల ధర్మరాజు ప్రసంగించారు. అనంతరం పరమవీరచక్ర అవార్డు గ్రహీత సంజయ్‌కుమార్‌తో పాటు పలువురు మాజీ సైనిక ఉద్యోగులను శాలువా, మెమెంటోలతో సత్కరించారు.

దిద్దుబాటుతో 'సర్దుబాటు'

నేటి నుంచి 14లోగా పూర్తి చేయండి

ఏలూరు అర్బన్, ఆగస్టు 11: ప్రస్తుతానికి అమల్లోవున్న ఉపాధ్యాయ, విద్యార్థుల సంఖ్య నిష్పత్తి ప్రాతిపదికగానే గతంలో జారీ చేసిన మార్గ దర్శకాల్లో కొన్ని సవరణలు చేస్తూ టీచర్ల వర్క్ అడ్జెస్ట్‌మెంట్‌ను సోమ వారం నుంచి బుధవారంలోగా ముగించాలని ఆదేశిస్తూ పాఠశాలవిద్య ఉన్నతాధికారులు ఆదివారం ఉత్తర్వులు జారీ చేశారు. తొలుత విడుదల చేసిన మార్గదర్శకాల్లో కొన్ని అంశాలపై అభ్యంతరాలు రావడంతో సాధ్య మైనంత మేర సవరణలు చేస్తూ, ముఖ్యంగా ఏ ఒక్క పాఠశాలలోను సబ్జె క్టు టీచరు కొరత లేకుండా చేయడమే ప్రధాన లక్ష్యంగా... హేతుబద్ధీకరణ ను పక్కనబెట్టి పని సర్దుబాటు మాత్రమే చేపడుతున్నట్టు వివరణ ఇచ్చారు. తాజాగా సవరించిన మార్గదర్శకాల ప్రకారం అన్ని స్కూళ్ళలోను విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా ఉపాధ్యాయులు పూర్తి స్థాయిలో ఉంటా రని స్పష్టం చేశారు. కొత్తగా ఈ నెల 9వ తేదీ నాటి యూడైస్ ఎన్‌రోల్ మెంట్ డేటాను ప్రామాణికంగా తీసుకుని వర్క్ అడ్జెస్ట్‌మెంట్‌ను చేపట్టాలని ఆదేశించారు. స్కూలులో కేడర్ జూనియర్‌నే సర్‌ప్లస్‌గా గుర్తించాలని సూచించారు.

వివరణలు/సవరణలు ఇలా...

అంతర్ జిల్లా బదిలీపై ఇక్కడకు వచ్చిన ఉపాధ్యాయుని సీనియార్టీని కొత్త జిల్లాలో విధుల్లో చేరిన తేదీనే ప్రామాణికంగా తీసుకుంటారు. ఇతర యాజమాన్యాల (ఎయిడెడ్ వగైరా) నుంచి ప్రభుత్వ పాఠశాలలో విధుల్లోకి చేరిన తేదీనే సీనియార్టీకి గుర్తించాలని సూచించారు. జీరో ఎన్‌రోల్‌మెంట్ ఉన్న పాఠశాలల్లోని టీచర్లందరూ సర్‌ప్లస్‌గానే నిర్ధారిస్తారు. హైస్కూల్ ప్లస్ ల్లోకి డిప్యూటేషన్‌పై నియమితులైన ఉపాధ్యాయులకు పని సర్దుబాటు నుంచి మినహాయింపునిచ్చారు. జీరో అడ్మిషన్లుగావున్న హైస్కూల్ ప్లస్‌ల్లోని ఉపాధ్యాయులను మాత్రం ఉన్నత పాఠశాల టీచర్లుగానే పరిగణించి వర్క్ అడ్జెస్ట్‌మెంట్ చేపడతారు. స్కూలులో శాంక్షన్డ్ పోస్టుతో నిమిత్తం లేకుండా ఎన్‌రోల్‌మెంట్ ఆధారంగా మాత్రమే ఉపాధ్యాయులను కొరత ఉన్న పాఠశాలలకు సర్దుబాటు చేస్తారు. కనీస వేతన స్కేలు(ఎంటీఎస్)పై నియమితు లైన ఎస్జీటీలుకూడా సర్‌ప్లస్‌గాఉంటే పని సర్దుబాటును వర్తింపజేస్తారు.

నేడు సర్‌ప్లస్ టీచర్లకు ఆన్‌లైన్ సర్దుబాటు కౌన్సెలింగ్

ఏలూరు అర్బన్, ఆగస్టు 11 : ఉపాధ్యాయుల పని సర్దుబాటుకు ఆన్‌లైన్ కౌన్సెలింగ్ సోమవారం మధ్యాహ్నం మూడు నుంచి సాయంత్రం ఐదు గంటల వరకు జరుగుతుందని డీఈవో అబ్రహం ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఏలూరు జిల్లాలోని 28 మండలాల్లో మిగులు (సర్‌ప్లస్) ఉపాధ్యాయుల జాబితాను ఆదివారం రాత్రి జిల్లా వెబ్‌సైట్‌లో పొందుపర్చడం తోపాటు, సంబంధిత టీచర్ల ఫోన్లకు వ్యక్తిగతంగా పాఠశాల విద్య కమిషనరేట్ నుంచి మెసేజ్ పంపించడం, ఎంఈవోల లాగిన్‌కు అప్‌లోడ్ చేయడం జరుగుతాయన్నారు. సదరు జాబితాలో ఉన్న సర్‌ప్లస్ టీచర్లు వారి వివరాలు సరిచూసుకుని, ఏవైనా తేడాలుంటే లిఖితపూర్వకంగా సంబంధిత ఎంఈవో కార్యాలయంలో సోమవారం ఉదయం 11 గంటల్లోగా అర్జీల రూపంలో అందజేయాలని ఆదేశించారు. ఆన్‌లైన్ విధానంలో వర్క్ అడ్జస్ట్‌మెంట్ జరుగుతున్నందున అర్జీలను ఉదయం 11 గంటల తర్వాత స్వీకరించబోమని స్పష్టం చేశారు. జాబితాలోఉన్న సర్‌ప్లస్ ఉపాధ్యాయులందరూ సంబంధిత ఎంఈవో కార్యాలయాల్లో జరిగే పని సర్దుబాటు కౌన్సెలింగ్‌కు తప్పనిసరిగా హాజరుకావాలని ఆదేశించారు. కాగా జిల్లాలో మున్సిపల్ యాజమాన్య పాఠశాలల్లోని సర్‌ప్లస్ టీచర్లను మినహాయించి, మిగతా పాఠశాలల్లో 370 మందికిపైగా ఎస్జీటీలు, స్కూల్ అసిస్టెంట్లు 'మిగులు' జాబితాలో ఉన్నారు. వీరిలో పది శాతం మందిలోపే స్కూల్ అసిస్టెంట్లు ఉన్నారు. టీచర్ల కొరత ఉన్న పాఠశాలలు మాత్రం 220 వరకు ఉన్నాయి.


సీబీ కెనాల్‌లో డెక్క తొలగింపు పనులు

సీబీ కెనాల్‌కు తాగునీటి విడుదల

కలిదిండి, ఆగస్టు 11 : మండలంలో సీబీ కెనాల్‌కు ఇరిగేషన్ అధికారులు ఆదివారం తాగునీటిని విడుదల చేశారు. సాగు, తాగునీటి ఎద్దడితో ప్రజలు అవస్థలు పడుతుండటంతో కైకలూరు ఎమ్మెల్యే కామినేని శ్రీనివాస్ ఇరిగేషన్ ఉన్నతాధికారులతో మాట్లాడి నీరు విడుదల చేయించారని మాజీ డీసీ ఛైర్మన్లు ముద్దం భోగేశ్వరరావు, పేటేటి సత్యనారాయణ తెలిపారు. గుర్వాయిపాలెం వంతెన సమీపంలో గుర్రపుడెక్క పేరుకుపోయి పెదలంక కాల్వకు నీటి సరఫరా కాకపోవడంతో డెక్క తొలగింపు పనులను చేపట్టారు. ప్రస్తుతం లంక గ్రామాలకు పూర్తిస్థాయిలో తాగునీరు సరఫరా అవుతోందని తాగునీటి చెరువులు నింపగానే సాగునీరు అందించాలని ఎమ్మెల్యే కామినేని ఆదేశాలు జారీ చేశారన్నారు. కాల్వ వెంబడి పశువుల, రొయ్యల వ్యర్థాలు వేయటంతో తాగునీరు కలుషితమవుతోందని, వాటి తొలగింపునకు అధికారులు చర్యలు తీసుకోవాలని కోరారు.



అమరావతి బ్రాండ్ అంబాసిడర్ వైష్ణవికి సత్కారం

ముదినేపల్లి, ఆగస్టు 11 : సమాజ సేవా కార్యక్రమాలు నిర్వహించటంతోపాటు అమరావతి రాజధాని నిర్మాణానికి తన పొలం అమ్మి రూ.25 లక్షలు విరాళంగా ఇచ్చిన అమరావతి బ్రాండ్ అంబాసిడర్ అంబుల వైష్ణవిని పలువురు ఘనంగా సత్కరించారు. ఆదివారం ముదినేపల్లిలో నిర్వహించిన అభినందన సభలో స్థానిక ఐటీఐ కళాశాల ప్రిన్సిపాల్ కూనపరెడ్డి సత్యనారాయణ, ఇండో సాక్సన్ హైస్కూలు కరస్పాండెంట్ జార్జి, ముదినేపల్లి ప్రెస్ క్లబ్ తరఫున చిలకపల్లి నాగరాజు, జి.విజయకుమార్ తదితరులు వైష్ణవిని సన్మానించారు. అనంతరం ముదినేపల్లిలో గంజాయి రహిత రాష్ట్రాన్ని ఆకాంక్షిస్తూ అవగాహన ర్యాలీ నిర్వహించారు. మాజీ ఏజీపీ రెడ్డి బంగారయ్య వైష్ణవి తండ్రి డాక్టర్ మనోజ్, ప్రెస్ క్లబ్ సభ్యులు, విద్యావేత్త కోడూరు అర్జునరావు తదితరులు పాల్గొన్నారు.

16 నుంచి రెవెన్యూ గ్రామ సదస్సులు

భూ సమస్యలు పరిష్కరించుకోవాలంటున్న అధికారులు

కైకలూరు, ఆగస్టు 11: కైకలూరు మండలంలో ఈ నెల 16 నుంచి రెవెన్యూ గ్రామ సదస్సులు నిర్వహిస్తున్నట్టు తహసీల్దార్ ఎం. ఉదయ భాస్కరరావు తెలిపారు. ప్రభుత్వం ఇటీవల గ్రామాల్లో భూ సమస్యలను పరిష్కరించేందుకు ప్రత్యేక ప్రణాళిక రూపొందించిందని అందులో భాగంగానే ప్రతి గ్రామంలోనూ సదస్సులను నిర్వహించి ఆ గ్రామ భూ సమస్యలను పరిష్కరిస్తామన్నారు. ఈ నెల 16 నుంచి సెప్టెంబరు 30 వరకు సదస్సులు నిర్వహిస్తున్నట్టు తెలిపారు. ఈ రెవెన్యూ సదస్సుల్లో భూ సమస్యలను ప్రజలు పరిష్కరించుకోవాలని కోరారు. తమ సమస్యలను అర్జీ రూపంలో ఆ గ్రామ సదస్సుల్లో అధికారులకు అందజేయాలన్నారు. 16న కొల్లేటికోట, శృంగవరప్పాడు, 19న కొట్టాడ, 21న పెంచికలమర్రు, 23న ఆలపాడు, 24న సోమేశ్వరం, 27న పల్లెవాడ, 29న భుజబలపట్నం, 30న గోనెపాడు, సెప్టెంబరు 2న సింగాపురం, 4, వదర్లపాడు, 6న సీతనపల్లి, 9న దొడ్డిపట్ల, 11న రామవరం, 13న వరహాపట్నం, 17న ఆటపాక, 19న గోవవరం, 21న రాచపట్నం, 23న ఆచవరం, 24న వింజరం, 26న శ్యామలాంబపురం, 27న తామరకొల్లు, 28న వేమవరప్పాడు, 30న కైకలూరులో గ్రామ సదస్సులు నిర్వహిస్తామని తెలిపారు. ఈ సదస్సుల్లో ప్రజలు తమ భూ సమస్యలను పరిష్కరించుకోవాలని కోరారు.

గంగానమ్మ జాతర



మండవల్లి ఆగస్టు 11 : మండలంలోని పలు గ్రామాల్లో శ్రావణ మాసం తొలి ఆదివారం సందర్భంగా భక్తులు గంగానమ్మ జాతరను ప్రారంభించారు. గ్రామాల్లో ఎటువంటి అంటురోగాలు ప్రబలకుండా చూడాలని గ్రామదేవత గంగానమ్మకు ప్రత్యేక పూజలు చేశారు. మండవల్లిలో అచ్యుత శివకుమార్ ఆధ్వర్యంలో మేళతాళాలతో భక్తులు గంగానమ్మ అమ్మవారికి సారె సమర్పించారు. అమ్మవారికి భక్తులు తొలుత చలినైవేద్యం సమర్పించారు.

కోలాహలంగా అంకమ్మ జాతర



ముదినేపల్లి, ఆగస్టు 11 : మండలంలోని చేవూరుపాలెంలో ఉన్న పరసా వారి అంకమ్మ జాతర ఆదివారం కోలాహలంగా జరిగింది. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని అమ్మవారు, పోతురాజుకు మొక్కులు తీర్చారు. ఆలయంలో అంకమ్మ వారికి కుంకుమ పూజలు, అభిషేకాలు జరిపారు. సర్పంచ్ పరసా విశ్వేశ్వరరావు ఆధ్వర్యంలో పరసా వంశీయులు, గ్రామస్థులు జాతరలో పాల్గొని పూజలు నిర్వహించారు.

నీట్-పీజీ పరీక్ష ప్రశాంతం

ఏలూరు అర్బన్, ఆగస్టు 11 : పీజీ వైద్య విద్య కోర్సుల్లో ప్రవేశాలకు ఆదివారం దేశ వ్యాప్తంగా నిర్వహించిన నీట్-పీజీ ఆన్‌లైన్ పరీక్ష ఏలూరులోని రెండు కేంద్రా ల్లో ప్రశాంతంగా ముగిసింది. సీఆర్ఆర్ ఇంజనీరింగ్ కళాశాల పరీక్షా కేంద్రంలో ఉదయం, మధ్యాహ్నం సెషన్లలో వంద మంది అభ్యర్థుల చొప్పున హాజరుకావాల్సి ఉండగా 99 మంది వంతున హాజరయ్యారు. సత్రంపాడు సిద్ధార్థ క్వెస్ట్ పరీక్ష కేంద్రంలో ఉద యం సెషన్‌లో జరిగిన పరీక్షలకు 149 మందికి 145 మంది, మధ్యాహ్నం సెషన్‌లో 149 మందికి 147 మంది హాజరయ్యారు. నీట్-యూజీ పరీక్ష ప్రశ్నపత్రం లీక్ ఉదంతం దేశవ్యాప్తంగా వివాదాస్పదం కావడంతో జూన్ 23న జరగాల్సిన నీట్-పీజీ పరీక్ష వాయిదావేసి పలు ముందస్తు జాగ్రత్తలు తీసుకుని ఆదివారం నిర్వహించారు.

● తాడేపల్లిగూడెం రూరల్: మెడికల్ కళాశాలల్లో పోస్టు గ్రాడ్యుషన్ కోర్సుల్లో ప్రవేశానికి నిర్వహించే నీట్ పరీక్షలు ఆదివారం ప్రశాంతంగా ముగిశాయి. తాడేపల్లిగూడెం మండలం పెదతాడేపల్లి వాసవి ఇంజనీరింగ్ కళాశాలలో రెండు షిఫ్టుల్లో జరిగిన పరీక్షలకు 222 మందికి గాను 216 మంది అభ్యర్థులు పరీక్షలు రాసినట్టు ప్రిన్సిపాల్ రత్నాకరరావు తెలిపారు.

నేడు హిందువులపై దాడులకు నిరసనగా ర్యాలీ

కైకలూరు, ఆగస్టు 11: బంగ్లాదేశ్‌లో హిందువులపై దాడులకు నిరసనగా హిందూ సంఘాల ఆధ్వర్యంలో కైకలూరులో శాంతియుతంగా నిరసన ర్యాలీ నిర్వహించనున్నట్లు ఆర్‌ఎస్ఎస్, హిందూ సంఘ సభ్యులు తెలిపారు. సోమవారం సాయంత్రం 5 గంటలకు కైకలూరు గాంధీబొమ్మ సెంటర్ నుంచి మాగంటి థియేటర్ వరకు జాతీయ రహదారి వెంబడి శాంతియుత నిరసన తెలియజేస్తామని ఈ దాడులను ఖండిస్తూ హిందువులు పెద్దఎత్తున పాల్గొనాలని పిలుపునిచ్చారు.

రేపు ఎన్‌డీఏ కార్యాలయం ప్రారంభం

ముదినేపల్లి, ఆగస్టు 11 : ముదినేపల్లిలో ఎన్‌డీఏ కూటమి కార్యాలయం ఏర్పాటైంది. ఈ కార్యాలయాన్ని ఈ నెల 13న ప్రారంభించనున్నారు. మంత్రులు కొల్లు రవీంద్ర, కొలుసు పార్థసారథి, ఎంపీ పుట్టా మహేష్ యాదవ్, స్థానిక ఎమ్మెల్యే డాక్టర్ కామినేని శ్రీనివాస్‌తోపాటు గుడివాడ, పెడన ఎమ్మెల్యేలు వెనిగండ్ల రాము, కాగిత కృష్ణ ప్రసాద్, ఏలూరు జిల్లా టీడీపీ అధ్యక్షుడు గన్ని వీరాంజనేయులు, జనసేన ఉమ్మడి కృష్ణా జిల్లా అధ్యక్షుడు బండ్రెడ్డి రామకృష్ణ, బీజేపీ జిల్లా అధ్యక్షుడు చౌటపల్లి విక్రమ్ కిషోర్ తదితరులు పాల్గొంటారు. కార్యాలయ ప్రారంభం అనంతరం బహిరంగ సభ జరుగుతుందని కూటమి నాయకులు తెలిపారు.

ఎరువుల విక్రయాలు ప్రారంభం

నూజివీడు టౌన్, ఆగస్టు 11: పల్లెర్లమూడి పీఏసీఎస్‌లో టీడీపీ గ్రామ అధ్యక్షుడు, పీఏసీఎస్ మాజీ అధ్యక్షుడు యలమదల సత్యనారాయణ ఎరువుల విక్రయాన్ని ఆదివారం ప్రారంభించారు. ఎరువుల విక్రయ లైసెన్స్‌ను పునరుద్ధరించిన అనంతరం రైతులకు అందుబాటులో ఎరువులను ఉంచామన్నారు. పీఏసీఎస్ పరిధిలోని రైతులందరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. టీడీపీ గ్రామ నాయకులు, కార్యకర్తలు, రైతులు పాల్గొన్నారు.

రామన్నగూడెంలో పెట్రోల్ బంకు ప్రారంభం

నూజివీడు టౌన్, ఆగస్టు 11: నూజివీడు మండలం రామన్నగూడెంలో భారత్ పెట్రోల్ బంకును బీపీసీఎల్ ఏలూరు సేల్స్ మేనేజర్ సూర్య ఆదివారం ప్రారంభించారు. గ్రామీణ ప్రాంతాల వినియోగదార్లకు అందుబాటులో ఉండేలా పెట్రోల్, డీజిల్, ఇంజన్ ఆయిల్స్‌ను అందుబాటులో ఉంచామన్నారు. బీజేపీ నూజివీడు మండల అధ్యక్షుడు భోగినేని శ్రీనివాస కుమార్ అప్పారావు, సీనియర్ న్యాయవాది వైఎస్ దొర్రై, టీడీపీ నాయకులు పామర్తి నాగేంద్రరావు తదితరులు పాల్గొన్నారు.

నూజివీడును ఎన్టీఆర్ జిల్లాలో కలపాలి

చాట్రాయి, ఆగస్టు 11: నూజివీడు అసెంబ్లీ నియోజకవర్గాన్ని ఎన్టీఆర్ జిల్లాలో కలపాలని సీపీఐ (ఎంఎల్) లిబరేషన్ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు డి. హరనాథ్ ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఎన్నికల ప్రచారానికి నూజివీడు వచ్చిన సీఎం చంద్రబాబు నూజివీడు నియోజకవర్గాన్ని తిరిగి కృష్ణా జిల్లాలో కలుపుతామని ప్రజలకు హామీ ఇచ్చారని అన్నారు. మంత్రి పార్థసారథి దీనిపై దృష్టి సారించాలన్నారు.


విజయ యాత్ర ర్యాలీని జయప్రదం చేయాలి

ముసునూరు, ఆగస్టు 11: మాదిగల విజయయాత్ర ర్యాలీని జయప్రదం చేసేలా ఎమ్మార్పీఎస్, ఎంఎస్పీ, ఎంఈఎఫ్, అనుబంధ సంఘాల నాయకులు నియోజకవర్గంలోని ప్రతి ఇంటికి వెళ్ళి ర్యాలీపై తెలియజేయాలని నూజివీడు నియోజకవర్గ ఎమ్మార్పీఎస్ అధ్యక్షుడు దుబ్బాకు దేవరాజు మాదిగ పిలుపునిచ్చారు. ఆదివారం ముసునూరులో ఆయన మాట్లాడుతూ ఈ నెల 13న హైదరాబాద్ కేంద్రంగా జరిగే మాదిగల విజయయాత్ర ర్యాలీకి యావత్ మాదిగ, మాదిగ ఉపకులాలు, అన్నివర్గాల ప్రజలు లక్షలాదిగా తరలివచ్చి విజయవంతం చేయాలని ఆయన కోరారు. ఒక లక్ష్యం కోసం మందకృష్ణ మాదిగ తన జీవితాన్ని త్యాగం చేశారని ఆయన పేర్కొన్నారు.

కాలిబాట.. దిగుబడులకు రాచబాట


చాట్రాయిలో కాలిబాటలు వేసిన వరి పొలం

చాట్రాయి, ఆగస్టు 11: వరి సాగులో కాలిబాటల విధానం అనుసరిస్తే ఎన్నో ప్రయోజనాలని వ్యవసాయ అధికారులు సూచిస్తున్నారు. ఇటీవల కాలంలో చాలా మంది ఔత్సాహిక రైతులు వరిసాగులో కాలిబాటల విధానం అనుసరిస్తూ సత్ఫలితాలు సాధిస్తున్నారు. కాలిబాటల మార్గంలో వరినాట్ల తొలగింపు వల్ల దిగుబడి తగ్గుతుందనేది అపోహ మాత్రమేనని వ్యవసాయాధికారులు అంటున్నారు. కాలిబాటలు వేసే సమయంలో రైతులు సరైన యాజమాన్య పద్ధతులు పాటించాలని సూచిస్తున్నారు. నాట్లు వేసిన 15 రోజుల వ్యవధిలో కాలిబాటలు వేసుకోవాలని, ఏదైనా తాడు తీసుకొని చేను గట్టుకు ఒకవైపు నుంచి మరోవైపుకు సాగదీసి కట్టాలని, కట్టిన తాడు వెంట 12 సెంటీ మీటర్లు వెడల్పు వరినాట్లు తొలగించాలని సూచిస్తున్నారు. కాలిబాటల వల్ల మొక్క వేరు బాగానికి సూర్యరశ్మి బాగా తగిలి చీడ పీడల బెడద తగ్గుతుంది. కాలిబాటల వెంట తిరుగుతూ చల్లితే ఎరువులు, పురుగు మందులు ప్రతి దుబ్బుకు చేరుతాయి. కలుపు తొలగించటానికి, తెగుళ్ళు ఆశిస్తే సులభంగా గుర్తించటానికి, ఎలుకల నివారణకు అనువుగా ఉంటుంది. ఎకరానికి 3 నుంచి 4 బస్తాల అధిక దిగుబడి వస్తుంది. తుఫాన్లు, భారీ వర్షాలు వచ్చినప్పుడు పైరులో కిరణజన్య సంయోగ క్రియ సమర్థంగా జరిగి దిగుబడి తగ్గదని వ్యవసాయాధికారులు అంటున్నారు.



కాలిబాటలతో సత్ఫలితాలు

వరిసాగులో కొన్నేళ్ళ నుంచి కాలిబాటల విధానం అనుసరిస్తూ మంచి ఫలితాలు పొందుతున్నా. చీడపీడలను అదుపు చేయటం, ఎరువులు, పురుగు మందుల యాజమాన్యం సులువుగా ఉంది. దిగుబడులు కూడా ఆశాజనకంగా ఉన్నాయి.

-ఎం. ప్రభాకరరెడ్డి, రైతు, చాట్రాయి



ఎన్నో ఉపయోగాలు

వరిసాగులో కాలిబాటల విధానంతో రైతులకు ఎన్నో ఉపయోగాలు ఉన్నాయి. కలుపు, చీడపీడల నివారణ, ఎరువులు, పురుగు మందుల యాజమాన్యం సులువవుతుంది. ప్రకృతి వైపరీత్యాలకు పైరు తట్టుకోవటంతో పాటు అధిక దిగుబడులు వస్తాయి.

- శివశంకర్, ఏవో, చాట్రాయి మండలం